


# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 11-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 330 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## నంద్యాల ఎన్నికల్లో
# మాటల తూటాలు



- చంద్రబాబు.. కాదు కాదు.. మోసబాబు
- బాబు దుర్నీతిని లౌక్యంగా తిప్పికొట్టాలి
- న్యాయానికీ, ధర్మానికీ ఓటు వేయండి
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

నంద్యాల: ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినట్టే ప్రజలను కూడా కొనుగోలు చేయొచ్చన్న అహంకారంతో చంద్రబాబు మూటలు, మూటలు డబ్బులతో నంద్యాలకు వచ్చారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఉప ఎన్నికలు రాగానే మహిళలను మోసం చేయడానికి చంద్రబాబుకు తరువాయి 2లో

## ● అమరావతిలో కార్పొరేట్ వైద్య సేవలకు
# బిఆర్ఎస్ మెడిసిటీ

- శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- రూ. 6,500 కోట్లు ఖర్చు
- 400మంది విద్యార్థులకు సీట్లు
- 500 మందికి ఉద్యోగావకాశాలు
- మెడికల్ హబ్‌గా విజయవాడ
- బిఆర్ఎస్ అధినేత శెట్టికి అభినందన
- నవ్యాంధ్ర సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతుల భూములలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.15,300 కోట్లు ఖర్చు చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరువాయి 2లో




## తగరపువలస అభివృద్ధికి కృషి చేస్తా

### రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం: తగరపువలస అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, లైటింగు మొదలైన పనులన్నింటినీ పక్కా ప్రణాళికతో చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మంత్రి తగరపు వలసలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఇప్పటికి తరువాయి 2లో



## డ్రగ్ రాకెట్ సూత్రధారి
# గాబ్రియేల్ అరెస్ట్

హైదరాబాద్: గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా మారిన హైదరాబాద్ డ్రగ్స్ దందాలో మరో కీలక అరెస్టు జరిగింది. నైజీరియన్ల డ్రగ్ రాకెట్లో సూత్రధారిగా భావిస్తున్న గాబ్రియేల్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ డ్రగ్స్ రాకెట్ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న గాబ్రియేల్‌ను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొద్ది కాలంగా హైదరాబాద్‌లోనే ఉంటూ నైజీరియన్ ముఠాలకు గాబ్రియేల్ డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ శివారులోని కౌకూర్‌లో ఓ అపార్ట్‌మెంట్లో ఉన్న గాబ్రియేల్‌తో పాటు అతడి ప్రియురాలిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. గాబ్రియేల్ నుంచి భారీగా కొకైన్, హెరాయిన్తో పాటు ల్యాప్‌టాప్, పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీ నుంచి ఇటీవలే నగరానికి వచ్చిన గాబ్రియేల్ యాప్రాల్ సమీపంలోని కౌకూర్ గ్రీన్‌హుడ్ అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గాబ్రియేల్ ఇచ్చే సమాచారం నైజీరియన్ డ్రగ్ రాకెట్ వ్యవహారంలో కీలకం అవుతుందని పోలీసులు భావిస్తున్నారు. గత రెండేళ్లుగా తరువాయి 2లో




# అజాత శతృవు మాధవ్

### ఘనంగా ఎమ్మెల్సీ మాధవ్ జన్మదిన వేడుకలు ■ పార్టీలకతీతంగా హాజరైన ప్రముఖులు



ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చొక్కాకుల వెంకటరావు, విజయభాను సంస్థల అధినేత బి. చంద్రశేఖర్, అంతకాపల్లి సర్పంచ్ చొక్కాకుల గోవింద్, సీనియర్ జర్నలిస్టు శశాంక్ మోహన్, బిజెపి నగర మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. ప్రేమ కుమారి, చొక్కాకుల ఛారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ సిహెచ్. రామకృష్ణ, అప్పలకొండ యాదవ్, తదితరులు వార్త 3లో

## గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్న భారత సైన్యం



న్యూఢిల్లీ : చైనాతో ప్రతిష్టంభన నేపథ్యంలో భారత సైన్యం కీలక చర్య చేపట్టింది. భారత్-భూటాన్-చైనా ట్రై జంక్షన్‌కు సమీపంలోని ఓ గ్రామాన్ని ఖాళీ చేయాలని ఆదేశించింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం నాథంగ్ గ్రామ తరువాయి 2లో




## టేకిట్ ఈజీ



మనం ఇన్నేళ్ళుగా జైల్లో ఉన్నామని నువ్వేం బాధపడకురా! మనక్కూడా మంచి రోజులు రానున్నాయి. చూద్దాం!!

## కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖపట్నం: కౌలు రైతులకు సంబంధించి ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం రుణాలను తప్పని సరిగా మంజూరు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులతో కౌలు రైతులకు సంబంధించి పంట రుణాలు, లోన్ ఎలిజిబిలిటీ (ఎల్ఇసి) కార్డులు, సర్టిపికేట్ ఆఫ్ కల్టివేషన్ (సిఓసి) తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రైతులు ఏ విధంగానూ నష్టపోకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం నుండి అన్ని గ్రామాలలోను ఎల్ఇసి కార్డులపై స్పెషల్ డ్రైవ్ పెట్టాలన్నారు. ఎక్కడైనా బ్యాంకుల నుండి సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బ్యాంకులలో రుణం పొందని రైతులు ఉంటే వారు ప్రీమియం చెల్లించే విధంగా వారికి అవగాహన తరువాయి 2లో


# జివియంసి కాంట్రాక్టు/ అవుట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలపై
# కమిషనర్‌తో సిఐటియు చర్చలు సఫలం



విశాఖపట్నం : జివియంసి పారిశుధ్య కార్మికులు, ఇతర అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై కమిషనర్ హరినారాయణన్‌తో జివియంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జరిపిన చర్చలు విజవంతమైనాయి. ప్రతీ నెల 5వ తేదికే వేతనాలు చెల్లింపుకు, కార్మికులకు సేఫ్టీ పరికరాలైన మాస్కులు, గ్లౌవ్స్, సబ్బులు, నూనె మొ॥వి సరఫరా చేయటానికి, వారం శెలవు, 15 క్యాజువల్ శెలవులు అమలుచేయటానికి, 333జీఓ ఎరియర్స్, విలీన కార్మికుల 13నెలల పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లింపుకు, కార్మికులకు ఇన్‌కంటాక్స్ రద్దు చేయటానికి, జివియంసి పరిధిలో కనీసవేతనాలు అమలుజరగని ఇతర అవుట్ సోర్సింగ్ కార్మికులైన హౌస్ కీపింగ్, యుజిడి, యుసిడి, మ్యూజియం, పార్కులు, స్వర్ణభారతి స్టేడియం, అనకా పల్లి పంచాయితీ కార్మికుల మొ॥ వారికి అమలుచేయడానికి, అందరికీ గుర్తింపు బ్యాడ్జిలు మంజూరు చేయడానికి, 151 జీఓ ప్రకారం డ్రైవర్లు మరియు ఇతర సెమిస్కిల్డ్ కార్మికులకు రూ.15,000/-లు, స్కిల్డ్ కార్మికులకు రూ.17,500/-లు త్వరలో చెల్లించడానికి కమిషనర్ అంగీకరించారు. పై సమస్యల పరిష్కారానికి సత్వరమే ఫైళ్లు పెట్టాలని జి.వి.వి.ఎస్.మూర్తి (ఎడిసి-జి)కి కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ చర్చల్లో యూనియన్ గౌ॥ అధ్యక్షులు పెతకంశెట్టి వెంకటరెడ్డి, అధ్యక్షులు గొల్లపల్లి సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముడే నాగేశ్వరరావు, వర్కింగ్ సెక్రటరీ శీర రమణ, కె.వి.రమణ గార్లు మరియు జివియంసి తరుపున కమిషనర్ హరినారాయణన్, అడిషనల్ కమిషనర్ (జనరల్) జి.వి.వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు. సానుకూలంగా స్పందించిన కమీషనర్ గారికి సిఐటియు యూనియన్ ధన్యవాధాలు తెలిపింది.

# జగన్ విషపుచుక్కలాంటివాడు

## - ఎమ్మెల్యే మృణాళిని



విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గరివిడి: ప్రజాస్వామ్మమనే అమృతంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి విషపు చుక్కలా మారాడని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఆరోపించారు. స్ధానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే గురువారం విలేకరులతో మాట్లాడుతూ తండ్రి వయస్సు ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని నడిరోడ్డుపై కాల్చిచంపాలని జగన్ అనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. జగన్ చేసిన వాఖ్యాలు ఆయనలో ఉన్న రౌడీజాన్ని బహిర్గతం చేసాయి అన్నారు. జగన్ లాంటి ఆవేశపరుడు, పరిపక్వత లేని వ్యక్తి ముఖ్య మంత్రి అయితే రాష్ట్రం రావణ కష్టాలా మారు స్తారని అన్నారు. జగన్ చేసిన వాఖ్యలపై ప్రజ లలో కూడా తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమ వుతున్నాయన్నారు. ఎన్నో ఒడిదడుగులు ఎదు ర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏనాడు నోరు జారలేదు అన్నారు. చంద్రబాబు నాయుడును చూసి జగన్ చాలా విషయాలు నేర్చుకోవాలన్నారు. ఇక వై.సి.పి. నాయకురాలు రోజా మాట్లాడుతున్న తీరు మహిళాలోకాన్నే కించపరిచే విధంగా ఉంది అని ఎమ్మెల్యే అన్నారు. నంధ్యాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భారీ మెజార్టితో గెలవడం ఖాయమని ఎమ్మెల్యే స్పష్టంచేసారు. 17 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్టంలో పరిపాలనను ప్రారంబించిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాలలోను అభివృద్ధి పరుస్తున్నారని మృణాళిని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి, ఎంపిపి సింహచలం, ఎ.ఎమ్.సి చైర్మన్ సీతారామరాజు, దేశం పార్టీ నేతలు సారిపాక సురేష్‌కుమార్, కింతిడ రవికుమార్, అడపా సూర్యనారాయణ, బలగం శ్రీనివాస్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# తాటపర్తిలో తాగునీటి సమస్య

రావికమతం : తాటిపర్తి గ్రామంలో తాగునీటి బోర్లు రెండు ఒకేసారి మరమ్మత్తులకు గురికావడంతో గ్రామస్థులు రెండు నెలలుగా నీటి కోసం అలమటిస్తున్నారు. మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు తాటిపర్తి గ్రామంలో సుమారు 200మంది జనాభా తాగునీటి అవసరాల కోసం రెండు బోర్లు నిర్మించారు. దీనిలో ఒక బోరు మే నెలలోనే భూగర్భజలాలు అడుగంటడంతో మూలకు చేరింది. మహిళలు వీఆర్వో సంస్థ పెద్దగెడ్డలో నిర్మించిన బోరునీటిని తెచ్చుకుంటున్నారు. ఆ బోరు గ్రామస్థులందరి మంచినీటి అవసరాలు తీర్చలేకపోవడంతో గెడ్డలోకి ఊటనీటినే తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతంవర్షాలు కురుస్తున్న తరుణంలో ఊటనీరు కలుషితమై ఎక్కడ రోగాల బారిన పడతామోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఎక్కడా కుళాయిలు లేవు రక్షిత మంచినీటి పథకం మంజూరైనా ఇంత వరకూ నిర్మాణం ప్రారంభం కాలేదు. బోర్లకు మరమ్మత్తు చేయించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించు కున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

# గొడౌన్‌లో భారీగా నల్లజీడి పిక్కలు

కొయ్యూరు : ఈ సంవత్సరం గిరిజనులు భారీ ఎత్తున నల్లజీడి పిక్కలు సేకరించారు. జిసిసి కూడా పెద్ద ఎత్తున కొనుగోలు చేసింది. దీంతో ఇప్పుడు గొడౌన్ల సమస్య ఏర్పడింది. రాజమండ్రిలో జిసిసి గొడౌన్ ఖాళీగా లేకపోవడంతో డౌనూరు గోడౌన్ నుంచి తరలించాల్సిన నల్లజీడిపిక్కలు బస్తాలను అలాగే ఉంచేశారు. సుమారు నాలుగు నెలల నుంచి బస్తాలు అక్కడే ఉండిపోయాయి. జిసిసికి సంబంధించి తేనె సహా ఇతర అటవీ ఉత్పత్తులను ప్రోసెసింగ్ చేసే యూనిట్లు కొన్ని రాజమండ్రిలో ఉన్నాయి. దీంతో జిసిసి అధికారులు ఇక్కడ సేకరించిన అటవీ ఉత్పత్తులను రాజమండ్రి గొడౌన్‌కు తరలిస్తారు. వాటిని అక్కడ ప్రోసెసింగ్ చేయడం గానీ, యధాతధంగా వ్యాపారులకు విక్రయించం గానీ చేస్తారు. చింతపల్లి, జికెవీధి, కొయ్యూరు మండలాల నుంచి 1,600 నల్లజీడిపిక్కల బస్తాలు వచ్చాయి. ఒక్కొక్క బస్తాలో 50కిలోలు పిక్కలుంటాయి. గతంలో పోల్చుకుంటే ఈ సంవత్సరం గిరిజనులు పిక్కలను భారీ ఎత్తున సేకరించారని ఆశాఖ అధికారులు తెలి పారు. తూర్పుగోదావరి జిల్లాలో కూడా నల్లజీడి పిక్కలను అధికంగా సేకరించారు.

# భయం వద్దు మేమున్నాం

## - సిఐ వైకుంఠంరావు

సింహాచలం: సైబర్ నేరాలపై అవగాహనను గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సిఐ వైకుంఠరావు ప్రజలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసారు. ముందుగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎక్కువగా నమోదయ్యే నేరాలు అకౌంట్ టేకోవర్‌కు సంబంధించినవే. ఈ సైబర్ నేరగాళ్లు వ్యాపార లావాదేవీలు జరిపే వారి ఈ-మెయిల్స్ ను హ్యాక్ చేస్తారు. అన్ సెక్యూర్డ్ ఈ-మెయిల్ ఐడీల లావాదేవీలను కొంతకాలం పరిశీలిస్తారు. అదును చూసుకుని నగదు చెల్లించాల్సిన వ్యక్తికి, నగదు తీసుకునే వ్యక్తిలా మెయిల్ పంపిస్తారు.

బ్యాంక్ ఖాతా మారిందంటూ తమ ఖాతాను మెయిల్‌లో పొందుపరుస్తారు. దీంతో చెల్లింపులు సైబర్ నేరగాడి ఖాతాలోకి వస్తాయి. అందుకే ఖాతాలు మారినట్టుగా సమాచారం వస్తే అవతలి వ్యక్తిని నేరుగా సంప్రదించి నిర్ధారించుకున్న తరవాతే డిపాజిట్ చేయడం ఉత్తమం అన్నారు. సైబర్ నేరాలు భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తాయ నడంలో సందేహం లేదు. వీటిపట్ల ప్రజలను అప్రమత్తుల్ని చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. సైబర్ నేరాలను పసిగట్టి నింది తులను అరెస్టు చేయాలంటే నిఘా వ్యవస్థలను సాంకేతికంగా బలోపేతం చేయాల్సి ఉంది. దేశ రక్షణకు సంబంధించి ఎప్పటికప్పుడు సరికొత్త సైబర్ యుద్ధతంత్ర వ్యూహాలను రచించాలి. అప్పుడే దేశానికి, దేశ పౌరులకు సంపూర్ణ భద్రత లభించినట్లవుతుంది. సైబర్ నేరాలను ఎదుర్కొ నే విషయంలో అంతర్జాతీయ సమాజం ఏకతాట పైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కేసుల్లో నిందితులను పట్టుకోవడం దాదాపు అసాధ్యం కాబట్టి, వీటిపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించాలి. కళాశాలలు, కార్యాల యాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు.

# పెదపల్లలో సి.సి. రోడ్లు ప్రారంభించిన

## శాసన మండల ఉపాధ్యక్షులు ఆర్.ఎస్.

ఆలమూరు : మండల పరిధిలో పెదపల్ల గ్రామంలోని ఓ.ఎన్.జి.సి. నిధులు రూ.18లక్షలతో నిర్మించిన సిసిరోడ్డును శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. అలాగే కమ్యూనిటీ భవనం పైభాగంలో వున్న కళ్యాణ మండపంలో పలువురు దాతలు సహకారంతో ఏర్పాటు చేసిన ఎ.సి.లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉల్లూరి లక్ష్మి సత్యనారాయణ, ఎంపిపి కొత్తపల్లి ధనలక్ష్మి కాశీ విశ్వనాధం, జెడ్‌పిటిసి దండంగి మమత రామారావు, ఎంపిటిసి వై.మెహెర్ ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ శ్యామ్‌వల్లీ, ఉపసర్పంచ్ అల్లూరి సత్యనారాయణ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గొడవర్తి నాగేశ్వరరావు, వైయస్సార్‌సిపి నాయకులు నెక్కంటి బుజ్జి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్ధి సంస్థల బంద్ విజయవంతం



అచ్యుతాపురం: విద్యార్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ ఆపాలని డివైఎఫ్ఐ జిల్లా అద్యక్షులు కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేసారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిర్వహించిన విద్యా సంస్థల బంద్‌లో భాగంగా మండలంలో విద్యా సంస్థల బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్ధులకు పాఠశాలల్లో, కళాశాలలో, హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే హాస్టల్లను, పాఠశాలలను మూసివేతను ఆపాలన్నారు.

విద్యార్ధులకు స్కాలర్‌షిప్స్‌ను, ఫీజ్‌రీయిం బర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్య లు పరిస్కరించాలన్నారు.

ఈ కార్య క్రమంలో మండల కార్యదర్శి జి.సాయి, ఈ.శ్రీను, పి.నవీన్, ఎల్.రవి, కె.వాసవి, వి.మాదురి, పి.ప్రమీళా విద్యార్ధులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
ELECTRICAL - SECTION
'e' Procurement Tender Notice No:10/2017-18/E.E(Elec), Dt:09.08.2017
01. Number of Works : 2 Nos
02. Value of Works (ECV) : Rs.7.20 Lakhs
03. Down Loading Start Date : 10-08-2017 @ 11.00 AM
04. Down Loading End Date : 24-08-2017 @ 01.00 PM
05. Last date & Time for receipt of Bids : 24-08-2017 @ 03.00 PM
06. Date of opening Tenders : 24-08-2017 @ 05.00 PM
Note: Further details at http://www.apeprocurement.gov.in
O/o the EE (Electrical) Cell No.9848882388
For COMMISSIONER

# రాష్ట్ర సదస్సుకు విజయవాడ తరలిరావాలి

అచ్యుతాపురం: స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల బిల్లు చట్టంగా మారితే ప్రవేటు పాఠశాలల్లో అడ్డూ, అదుపు లేకుండా ఆర్ధిక దోపిడీ యదేచ్చగా కొనసాగుతుందని డి.టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు అన్నారు. గురువారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల ముసాయిదా బిల్లుపై ఈ నెల 13న విజయవాడలో బసవపున్నయ్య విద్యాకేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు తరలి రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలోనూ విద్యా వ్యాపారాన్ని విస్తరించటానికి కార్పొరేట్ విద్యా సంస్థలకు పూర్తి స్వేఛ్ఛనిస్తూ చట్టాన్ని తీసుకురావాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. 1994లో ప్రవేట్ పాఠశాల స్థాపన, నిర్వాహణకు ప్రభుత్వం జారీ చేసిన జిఓ నెం 1లో పేర్కొన్న నిబందనలకు పూర్తి విరుద్దంగా ప్రస్తుత బిల్లు రూపొందిందన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# నంద్యాల ఎన్నికల్లో మాటల తూటాలు

కుట్టుమిషన్లు గుర్తొస్తాయి. రైతులను మోసం చేయడానికి ట్రాక్టర్లు గుర్తుకొస్తాయి. చంద్రబాబుకు ఇంతింత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది. మన దగ్గర నుంచి దోచిన సొమ్మే మనకు కొద్దో-గొప్పో ఇచ్చే కార్యక్రమం చేస్తున్నారు. మద్యం నుంచి ఇసుక వరకు దోపిడే, గుడి భూముల నుంచి రాజధాని భూముల వరకే దోపిడే' అని అని అన్నారు. చంద్రబాబు తన మూడున్నరేళ్ల పాలనలో మూడున్నరలక్షల కోట్ల రూపాయలు వెనకేసుకున్నారని ఆరోపించారు. ఆరు కోట్లమంది రాష్ట్ర జనాభాలో మూడున్నర లక్షల కోట్ల రూపాయాలు చంద్రబాబు దోచుకున్నారని, సగటున ఒకరి నుంచి రూ. 60వేల చొప్పున చంద్రబాబు దోపిడీ సాగిందని ధ్వజమెత్తారు. దోచుకున్న సొమ్ము నుంచి ఓటర్లకు ఐదువేల చొప్పున చంద్రబాబు పంచబోతున్నారని అన్నారు. 'రానున్న రోజుల్లో చంద్రబాబునాయుడు మూటలు మూటలు డబ్బులతో వచ్చి.. డబ్బులు చేతులో పెట్టి.. తన జేబులో నుంచి దేవుడి పటం తీసి.. తనకే ఓటు వేయాలంటూ మీ అందరితో ప్రమాణం చేయించుకుంటారు. ఏ దేవుడు కూడా పాపం చేయమని చెప్పడు. పాపం చేయమని సైతాన్, దెయ్యమే చెప్తుంది. ఆ దెయ్యాలు మీ దగ్గరకు వచ్చి.. చేతుల్లో డబ్బులు పెట్టి.. ప్రమాణం చేయమన్నప్పుడు ఆ దెయ్యాలతో గొడవ పడకండి. ధర్మం వైపు మేమంతా నిలబడతామని మనస్సులో దేవుడిని తలుచుకొని.. లౌక్యంగా వాళ్లు చేసే దుర్బుద్ధిని, దుర్నీతిని తిప్పికొట్టండి' అని వైఎస్ జగన్ ఓటర్లకు సూచించారు. కచ్చితంగా న్యాయానికి, ధర్మానికే ఓటు వేయాలని నంద్యాల ప్రజలను ఆయన కోరారు. చంద్రబాబు మూడున్నరేళ్ల పాలన మీద ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, చంద్రబాబు తన పాలనలో ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకున్నారా అని నిలదీస్తూ ఓటువేద్దామని ఆయన సూచించారు. చంద్రబాబు ప్రతి ఒక్కరికీ వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. 'రైతుల రుణాలు మాఫీ కావాలంటే, బ్యాంకుల్లోని బంగారం ఇంటికి రావాలంటే.. బాబు ముఖ్యమంత్రి కావాలన్నాడు. జాబు కావాలంటే బాబు రావాలన్నాడు. జాబ్ ఇవ్వకపోతే ఇంటింటికి రూ. రెండువేలుచొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానన్నాడు. కానీ ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదు' అని వైఎస్ జగన్ మండిపడ్డారు. కర్నూలు జిల్లాకు సైతం అది చేస్తాం ఇది చేస్తాం అని చంద్రబాబు మభ్యపెట్టారని విమర్శించారు.

### ప్రతి ఓటు అధర్మానికి వ్యతిరేకంగా పడాలి!

'ఇప్పటివరకూ ఏమి చేయని బాబు.. ఉప ఎన్నికకు వచ్చే సరికి ఏవేవో చేస్తానంటున్నాడు. మళ్లీ మోసగిస్తాడు. ఈ పరిస్థితి మార్చాలి. నంద్యాలలో వేసే ప్రతి ఓటు కూడా ఆయన చేసిన అధర్మానికి వ్యతిరేకంగా వేయాలి. ఈ ఎన్నికల్లో మీ అందిరితో చెప్తున్నాను. శిల్పాను అభ్యర్థిగా నిలబెడుతున్నాను. ప్రతి ఓటూ జగన్‌కు వేస్తున్నామనే విషయాన్ని మనసులో పెట్టుకోండి. ఏడాదిన్నరలో జరగబోయే మహాసంగ్రామానికి ఈ ఉప ఎన్నిక నాంది పలకబోతుంది. ప్రతి ఒక్కరూ చిక్కటి చిరునవ్వుతో ఆప్యాయత చూపుతున్నారు. ఆప్యాయత అనురాగానికి ప్రతి అక్కకు, చెల్లికి, అవ్వకు, తాతకు, హృదయపూర్వకంగా కృతజ్ఞతలు. సెలవు. ఇంకొక చిన్న విన్నపం. మన పార్టీ గుర్తు తెలియని వారు ఎవరైనా ఉంటే.. తెలిసిన వారందరూ చెప్పాలి. ఒకసారి గుర్తు చూపిస్తున్నాను అందరూ మన గుర్తు ఫ్యాన్ అని గుర్తుంచుకోవాలి' అని వైఎస్ జగన్ అన్నారు.

# డ్రగ్ రాకెట్ సూత్రధారి గాబ్రియేల్ అరెస్ట్

బిజినెస్ వీసాపై గాబ్రియేల్ నగరానికి వచ్చి వెళ్తున్నాడని, గోవా నుంచి మాదకద్రవ్యాల్ని నగరానికి దిగుమతి చేయడంలో అతనిదే ముఖ్య భూమికని పోలీసులు అనుమానిస్తున్నారు. కొకైన్, బ్రౌన్‌షుగర్, ఎంపిటమైన్ తదితర మాదకద్రవ్యాల విక్రయ ముఠాలతో గాబ్రియేల్‌కు సత్సంబంధాలున్నాయని ఇప్పటికే పోలీసులు గుర్తించారు.

కాగా, గత నెలాఖరులో ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో నైజీరియన్ ఒజుకు కాస్మోస్, అతని ప్రియురాలు విజయవాడకు చెందిన పాలపర్తి సంగీత ముఠాను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారు డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు చిక్కడంతో గాబ్రియేల్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ గ్యాంగ్ విక్రయిస్తున్న డ్రగ్స్‌ను గాబ్రియేల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వారు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో గాబ్రియేల్ గురించి పోలీసులు ఆరా తీశారు. గతంలో 20 గ్రాముల కొకైన్ విక్రయించేందుకు ప్రయత్నించిన గాబ్రియేల్‌ను ఈస్ట్‌మారేడ్‌పల్లి పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. ఆ కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన గాబ్రియేల్.. ఆ తర్వాత కూడా దందా సాగించినట్లు తేలింది. ఈనేపథ్యంలో గాబ్రియేల్ కదలికపై నిఘా ఉంచిన పోలీసులు ఢిల్లీ నుంచి అతను వచ్చాడనే పక్కా సమాచారంతో దాడిచేసి పట్టుకున్నారు.

# గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్న భారత సైన్యం

వాసులను తక్షణమే ఖాళీ చేయాలని ఇండియన్ ఆర్మీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ గ్రామంలో సుమారు 200 మంది నివసిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం భారత్-చైనా మధ్య ప్రతిష్టంభనకు కారణమైన డోకలామ్‌కు 35 కి.మీ. దూరంలో ఈ గ్రామం ఉంది.

సుక్నా నుంచి డోకలామ్ వైపు భారతదేశానికి చెందిన 33 కార్ప్ దళాలు వెళ్తున్నాయి. వీరిని ఈ గ్రామంలో ఉంచుతారా? అనే విషయంపై స్పష్టత కనిపించడం లేదు. చైనా దళాలు ఏ క్షణంలోనైనా దూకుడు ప్రదర్శిస్తే, ప్రజలను కాపడే ఉద్దేశంతో ఈ దళాలను పంపిస్తున్నారా? అనే అంశంపై కూడా సమాచారం తెలియడం లేదు.

నాథంగ్ గ్రామస్థులు మాట్లాడుతూ ఇటీవల భారతీయ దళాలు భారీగా తమ గ్రామం వైపు వస్తున్నట్లు తెలిపారు.

దీనిపై సైనికాధికారులు మాట్లాడుతూ ఏటా జరిగే సాధారణ విన్యాసాల్లో భాగంగానే దళాలు వెళు న్నాయని చెప్పారు. అయితే ప్రతి సంవత్సరం సెప్టెంబరులో జరిగే విన్యాసాలను ఈసారి ఆగస్టులోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# అమరావతిలో కార్పొరేట్ వైద్య సేవలకు బిఆర్ఎస్ మెడిసిటీ

తెలిపారు. గురువారం గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం తుళ్ళూరు మండలం దొండపాడు గ్రామంలో సుమారు రూ.6,500 కోట్లతో నిర్మించనున్న బి.ఆర్. శెట్టి అమరావతి మెడిసిటికి ముఖ్యమంత్రి శంకు స్ధాపన చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ, విభజన జరిగిన తరువాత నూతన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అవసరమైన సందర్భంలో భూ సమీకరణకు పిలుపునివ్వడం జరిగిందని, తద్వారా రైతులు నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములు ఇచ్చి ఎంతో సహకరించారని అన్నారు. రాజధానిని విద్య, వైద్య, తదితర అన్ని రంగాలలో అభివృద్ధి చేసే సందర్భంలో వైద్య రంగంలో విశేష అనుభవం వున్న కర్ణాటక వాసి బి.ఆర్. శెట్టి అగ్రస్ధానంలో వున్న తమ ఆసుపత్రి, కళాశాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినందుకు అభినందనలని అన్నారు. సుమారు రూ.6,500 కోట్లతో ఏర్పాటు చేయనున్న మెడిసిటీలో 400 మంది విద్యార్ధినీ విద్యార్ధులకు సీట్లు లభించే అవకాశం ఉందన్నారు. అలాగే మరో 500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అంతే కాకుండా వేయి మంచాలతో ఏర్పాటు చేసి, అంత మందికీ ఉచితంగా వైద్య చికిత్సను అందిస్తామని శెట్టి తెలియజేసినట్లు చెప్పారు. మెడిసిటి అధినేత, పద్మశ్రీ బి.ఆర్. శెట్టి మాట్లాడుతూ, భారత దేశ ప్రధాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు, నూతన రాజధాని అమరావతిలో మెడిసిటి ఏర్పాటుకు ముందుకు వచ్చామని అన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రతిపాటి పుల్లారావు, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు షేక్ జానీ మూన్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, సి.ఆర్.డి.ఎ. కమీషనర్ శ్రీధర్ చెరుకూరి, సంయుక్త కలెక్టర్ క్రితికా శుక్లా, వివిధ శాఖల అధికారులు, బి.ఆర్.ఎస్. మెడిసిటి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తగరపువలస అభివృద్దికి కృషి చేస్తా

రూ. 42.69 కోట్ల పనులకు మంజూరు చేసుకున్నామని తెలిపారు. ఇందులో 25.12 కోట్ల రూపాయల విలువ గల పనులను పూర్తి చేసుకుని ప్రారంభోత్సవాలు చేసుకున్నామన్నారు. గురువారం 2.4 కోట్ల రూపాయలు విలువగల పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని మిగిలిన పనులను త్వరలో మొదలుపెట్టి పూర్తి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ హరినారాయణన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బి. మణిశంకర్ నాయుడు పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరైనారు. అంతకు ముందు మంత్రి వరద నీటి కాలువల నిర్మాణానికి గాను 2.45 కోట్ల రూపాయలు పనులకు శంఖుస్థాపనలు గావించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సన ఫౌండేషన్ వారిచే 20 లక్షల రూపాయలతో నెలకొల్పబడిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

# కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

కలిగించాలన్నారు. ఆగస్టు 21వ తేదీ లోపల బీమా చెల్లింపు ఆఖరి తేది కాబట్టి రెన్యూవల్ చేసుకునే విధంగా వారికి తెలియజేయాలన్నారు. ఎల్ఇసి కార్డులకు సంబంధించి జిల్లాకు 15 వేలు లక్ష్యం కాగా 12 వేలు రీప్లేస్‌మెంట్ కార్డులు, 3 వేలు ఫ్రెష్ కార్డులన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఎల్‌డిఎం శరత్ బాబు మాట్లాడుతూ 3,112 మంది కౌలు రైతులకు కార్డులు ఇవ్వడం జరిగిందని అందులో 842 మందికి బ్యాంకు రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ జెడి శివప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులకు నేటి వరకూ రుణ అర్హత పత్రాలు 5,384 మందకి మంజూరు చేయడం జరిగిందని, ఏజెన్సీ మండలాలలో 1764 మందికి మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

### రైతులకు కావల్సిన ఎరువుల సరఫరాను

# వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం : ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులకు కావల్సిన ఎరువుల సరఫరాను వేగవంతంగా పూర్తి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వ్యవసాయశాఖ అధికారులు, ఎరువులు పంపిణీ డీలర్లను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎరువుల సరఫరా మరియు ఇ పోస్ మిషన్ల అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ, డిఆర్‌డిఎ అధికారులు సంయుక్తంగా కలిసి మండల, గ్రామస్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేసి రైతులకు ఎరువుల వాడకంపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరు లోపల ఎరువులను సరఫరా చేయాలన్నారు. ఇపోస్ మిషన్ వాడకాన్ని పూర్తి స్థాయిలో చేయాలన్నారు. డీలర్లకు ఈ యంత్ర వాడకంపై శిక్షణ ఇచ్చి అవగాహన కలిగించాలన్నారు. ఎరువుల తయారీ కంపెనీలు వేగవంతంగా ఎరువులను సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు.

వ్యవసాయశాఖ జెడి శివప్రసాద్ మాట్లాడుతూ 2017 ఖరీఫ్‌కు సంబంధించి 47, 125 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా లక్ష్యం కాగా నేటికి 1480 మెట్రిక్ టన్నుల వివిధ రకాలైన ఎరువులను, ఏజెన్సీ మండలాలలో 145 మెట్రిక్ టన్నులు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇపోస్ యంత్రాలకు సంబంధించి 279 రిటైల్ ఫెర్టిలైజర్ డీలర్లు వున్నారని, ఇంతవరకు 90 ఇపోస్ మిషన్లను సరఫరా చేయడం జరిగిందని, ఇంకా 189 మిషన్లు రావల్సి ఉందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీల రిటైల్ డీలర్లు పాల్గొన్నారు.

## ముందస్తు ఎన్నికలు రావచ్చు వాటిని ఎదుర్కొవడానికి సిద్ధంగా వుండండి : అన్నంరెడ్డి అధీప్‌రాజ్

సబ్బవరం: ముందుస్తు ఎన్నికలు జరిగితే వాటిని ఎదుర్కొవడానికి సిద్ధంగా వుండాలని వైసీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అధీప్‌రాజ్ కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో ఉన్న వైసీపీ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా అధీప్‌రాజ్ పాల్గొన్నారు.



వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న అధీప్‌రాజ్

ఈ సమావేశంలో అధీప్‌రాజ్ మాట్లాడుతూ ముందుస్తు ఎన్నికలు రావచ్చునని వాటిని ఎదుర్కొవడానికి సిద్ధంగా వుండాలని వైసీపీ కార్యకర్తలను కోరారు. మండలంలో 57 బూత్ కమిటీలకుగాను 51 బూత్ కమిటీలు వేయడం జరిగిందని ఇంకా ఆ భూత్ కమిటీలు పెండింగులో ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలను కోరారు. నవర్నాల పథకం ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, టీడీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. జగన్ పాదయాత్ర కూడా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, వనం అచ్చిం నాయుడు, కొటాన వెంకటరమణ, పరవాడ వెంకటరమణ, తుంపాల అప్పారావు, బుది రెడ్ల రామకృష్ణ, ఎల్.కేశవరావు, బలిరెడ్డి కనకరాజు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యక్షేత్ర అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్



సింహాచలం : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ, ఎస్ ఈ సుబ్బారావు సింహాచలం దివ్యక్షేత్ర పనులను పరిశీలించారు. ముందుగా కొండపై నిర్మాణం జరుగుతున్న క్యాంటిన్ భవనం, పుట్టుకొప్పుల భవనం వెనుక నిర్మాణం జరుగుతున్న క్యూలైన్ , మెట్లమార్గం, కొండక్రింద శ్రీనివాసనగర్ వద్ద కల్యాణమండపం, డార్మెటరీ భవనం, తొలిపావంచా, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుకాణాలు, డార్మెటరీ భవనం, తొలి పావంచా, వరాహపుష్కరిణి మొదలగు ప్రదేశాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఆయా ప్రదేశాల్లో నిర్మాణాలు జరుగుతున్న పరిశీలన చేసి సాంకేతిక విభాగం అధికారులకు సలహా సూచనలను ఇచ్చారు. వీరివెంట కార్యనిర్వాహణాధికారి కోడూరి అచ్చుత రామచంద్ర మోహన్, ఈఈ కోటేశ్వరరావు, డిఇఇ లు మళ్ళీశ్వరరావు, రమణ, ఏఈలు రాంబాబు, తాతాజీ, ఉప స్థపతి అమ్మన్న రాజా, వి కుటుంబరావు, డ్రాఫ్టుస్మెన్ పివి రాజబాబు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మురళీకృష్ణ, శ్రీనివాస రామానుజం, భారతి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

## సాయి గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆంగ్లభాషపై కార్యశాల



విశాఖపట్నం : సాయి గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో అపెక్స్ సంస్థ నిపుణులచే 'ఆంగ్ల భాషలో పదజాల ప్రయోగం, ఆప్టిట్యూడ్‌లో ప్రశ్నల పరిష్కారం' అను అంశంపై కార్యశాల నిర్వహింపబడింది.ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో ప్రశ్నా పత్రాలను ఎలా పొంద వచ్చునో మరియు వాటిని విశ్లేషించి ఎలా సమాధానాలు ఇవ్వవచ్చునను అంశంపై ప్రజెంటేషన్‌ను సంస్థ ట్రైనర్ కృష్ణ చైతన్య వివరించారు.

అంతకు ముందు జరిగిన సెషన్‌లో అపెక్స్ కంపెనీ సీఇవో 'సూరజ్ చావ్లా' ఆంగ్లభాషలో పదజాల ప్రయోగం, ఇంటర్వ్యూలలో వచ్చే ప్రశ్నలు, వాటి సమాధానాల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించి, వారిచే సమాధానాల పరు రాబట్టి వాటిలో తగు సూచనలు చేశారు. తదుపరి సెషన్‌లో మరిన్ని విషయాలపై పరీక్షలు నిర్వహించ నున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షలో విద్యార్థినీ, విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కళాశాల యాజమాన్యంచే కోర్సులో రాయితీలు ఇవ్వనున్నామని, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.మురళీకృష్ణ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఫైనల్ ఇయర్ విద్యార్థినీ, విద్యార్థులు, సాయి గణపతి స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ స్పాక్ పి.జానీఖాన్, టిపిఓ రమేష్‌నాయుడు, అధ్యాపకులు, వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

# అజాత శతృవు మాధవ్

- ఘనంగా ఎమ్మెల్సీ మాధవ్ జన్మదిన వేడుకలు
- పార్టీలకతీతంగా హాజరైన ప్రముఖులు



ఎమ్మెల్సీ మాధవ్‌కు జన్మదినం సందర్భంగా దుశ్శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చొక్కాకుల వెంకటరావు, అంతకాపల్లి సర్పంచ్ చొక్కాకుల గోవింద



ఎమ్మెల్సీ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న భూమాత సంస్థల చైర్మన్ తాళ్లూరు పూర్ణచంద్రరావు, నగర మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. ప్రేమకుమారి తదితరులు



ఎమ్మెల్సీ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న బోకం శ్రీనివాస్ యువసేన సభ్యులు బోకం బాలు, డెక్కా పవన్, బోకం కృష్ణకుమార్, బోకం కిషోర్, రెడ్డి ప్రసాద్, జి. భూషణ్, సిహెచ్ఎస్ నాయుడు, బోకం లోకేష్, డెక్కా భార్గవ్, రెడ్డి రాజా, వి.లక్ష్మణ్, బి. శ్రీను తదితరులు

విశాఖపట్నం: కుల, మత, జాతి, వర్ణ, వర్గ విభేదాలకు దూరంగా ఉంటూ పార్టీలకతీతంగా అందరి ఆదరాభిమానాలు చూరగొంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి విద్యార్థి నాయకుడి నుంచి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగిన పివిఎన్ మాధవ్ ప్రజల గుండెల్లో అజాత శతృవుగా తనదైన శైలిలో పయనిస్తున్నారని ప్రముఖ వ్యాపారవేత్త, చొక్కాకుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చొక్కాకుల వెంకటరావు ఎమ్మెల్సీ మాధవ్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. గురువారం ఎమ్మెల్సీ మాధవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛాన్నిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకటరావుతో పాటు ఆయన సోదరుడు, సబ్బవరం మండలం, అంతకాపల్లి సర్పంచ్ చొక్కాకుల గోవింద్ ఈ జన్మదినోత్సవ వేడుకలకు హాజరై మాధవ్‌కు దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్నిచ్చి తమ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ మాధవ్ నిజాయితీకి, నిబద్ధతకు, కష్టపడే తత్వానికి మారుపేరుగా చిన్ననాటి నుంచే ఎదిగారన్నారు. చిన్నతనం నుంచే ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చాలా చురుకుగా పాల్గొంటూ విద్యార్థి దశనుంచే అనేక సామాజిక, రాజకీయ కార్యక్రమాలు, ర్యాలీలు మరియు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. 2005లో వందేమాతర ఉద్యమం 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా **'వందేళ్ల వందేమాతరం'** పేరున సోంపేట నుంచి తిరుపతి వరకు పలు ప్రజా సమావేశాలను, దేశభక్తి కార్యక్రమాలు, బహిరంగ సభలను నిర్వహించారని, ఇది తన రాజకీయ జీవితానికి మచ్చుతునక అని పేర్కొన్నారు. విశాఖపట్నం ప్రాంతీయ రాజకీయాలలో కూడా ఆయన పలుకీలక పాత్రలు పోషించి వుడా వేలములు, యారాడ కొండ, గంగవరం, ప్రాంతంలో భూ ఆక్రమణలు, దిబ్బపాలెం వాసుల స్థాన చలన సమస్యలు, ద్రవ్యోల్బణం, విశాఖకు ప్రత్యేక రైలు, భూ పట్టాల పంపిణీ, లోఓల్టేజి సమస్యలు, అక్రమ పార్కింగ్ ఫీజుల వసూళ్లు, ఎస్ఇజెడ్ సమస్యలు, కోస్టల్ కారిడార్‌కు వ్యతిరేకంగా పలు పట్టణ, గ్రామీణ సమస్యలపై పోరాడారన్నారు.

అనంతరం మాధవ్‌కు పలువురు బిజెపి నాయకులు, బిజెపి సిటీ జనరల్ సెక్రటరీ దక్షిణా మూర్తి, పరశురామ రాజు, బిజెపి కార్యకర్తలు, అభిమానులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్సీ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నగర కార్యవర్గ సభ్యుడు జాగారపు శ్రీను



ఎమ్మెల్సీ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న డాక్టర్ తమ్మినాయుడు



ఎమ్మెల్సీ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏపీ స్టేట్ ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.వి. రమణ, భాజపా నగర మహిళా నాయకురాలు బేబి

విజయభాను

సంపాదకీయం

## విలువలతో కూడిన రాజకీయాలు

రాజకీయాలను భ్రష్టు పట్టించడంలో రెండు పక్షాలూ పోటాపోటీగా సాగుతున్నాయి. రాజకీయ పక్షాలు ప్రజాసేవాకాంక్ష గల ఉత్తమమైన నాయకులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నట్టయితే వారు ప్రలోభాలకు గురికారు. క్యాంపు రాజకీయాలు, బహిరంగ ఓటింగ్ విధానాల అవసరం ఉండదు. ఇప్పటికైనా రాజకీయ పక్షాలు విలువలతో కూడిన రాజకీయాలను నెలకొల్పడానికి ప్రయత్నించాలె. గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవడానికి జరిగిన పోలింగ్ సార్వత్రిక ఎన్నికలను తలపించి ఉత్కంఠను రేపింది. బీజేపీ, కాంగ్రెస్ కొద్ది రోజులుగా నడుపుతున్న రాజకీయ నాటకం రసవత్తరంగా మారి అర్ధరాత్రికి పతాకస్థాయికి చేరింది. మొత్తం మూడు స్థానాలలో బీజేపీకి ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకునే బలం మాత్రమే ఉన్నది. లెక్క ప్రకారం మూడో స్థానం కాంగ్రెస్‌కు దక్కుతుంది. కానీ బీజేపీ మూడో అభ్యర్థిని కూడా పోటీ పెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి గెలువాలనుకున్నది. కాంగ్రెస్ నుంచి కొంత మందిని తమవైపు తిప్పుకోగలిగింది. కాంగ్రెస్‌లోని బలమైన నాయకుడు వాఘేలా కొత్త పార్టీ ఏర్పాటు చేసి, బీజేపీకి మద్దతు పలికారు. కాంగ్రెస్ చీఫ్ విప్‌గా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే బల్వంత్‌సింహ్ రాజ్‌పుత్‌ను మూడో అభ్యర్థిగా నిలబెట్టి కాంగ్రెస్ ప్రముఖుడు, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ విజయావకాశాలను దెబ్బకొట్టాలని భావించింది. వచ్చే ఏడాది గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీయాలనే ది బీజేపీ నేత అమిత్ షా ఎత్తుగడ. కానీ రాజ్యసభకు పోటీ చేస్తున్న అహ్మద్ పటేల్ కూడా అమిత్‌షా మాదిరిగా అపర చాణక్యుడే. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రత్యేక శిబిరానికి తరలించి కాపాడుకున్నారు. బీజేపీకి ఓటేసి బ్యాలట్ పత్రాన్ని అమిత్‌షాకు చూపించిన తమ ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లను చెల్లకుండా చేయించడంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం సఫలమైంది. దీంతో బీజేపీ వ్యూహం బెడిసికొట్టడమే కాదు, ఆ పార్టీ నైతికత ప్రశ్నార్థకమైంది. పార్టీ రాజకీయాలు ఎట్లా ఉన్నా, బ్యాలట్ పత్రాన్ని బహిరంగ పరిచిన కాంగ్రెస్ సభ్యుల ఓట్లు చెల్లవని ప్రకటించిన ఎన్నికల కమిషన్ నిర్ణయం హర్షించదగినది. ప్రజాక్షేత్రంలో విజయం సాధించి చట్టసభల్లో ప్రవేశించడం ప్రజాస్వామ్య లక్షణం. అయితే దేశ ప్రయోజనాల కోసం, శాసన రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మేధావుల సేవలను ఉపయోగించుకోవడం కూడా అవసరమే. రాజ్యసభ ఇందుకు వీలు కల్పిస్తున్నది. కానీ ఇటీవలి కాలంలో పారిశ్రామికవేత్తలు పార్లమెంటులో ప్రవేశించడానికి శాసన సభ్యులను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. అందువల్ల రాజ్యసభ ఎన్నికలలో ఓటేసే శాసన సభ్యులు పార్టీ నిర్ణయానికి కట్టుబడేందుకు బహిరంగ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రకారం శాసనసభ్యుడు ఓటేసిన తరువాత బ్యాలెట్ పత్రాన్ని పార్టీ నియమించిన ప్రతినిధికి చూపించవలసి ఉంటుంది. నిజానికి ఇటువంటి నిబంధన ఉండటం బాధాకరమే. శాసనసభ్యుని స్వేచ్ఛకు భంగం కలుగకూడదు. ప్రజాస్వామ్యానికి, ఎన్నికల వ్యవస్థకు ప్రాణప్రదమైన రహస్య బ్యాలెట్ విధానం చెక్కుచెదరకూడదనేది ప్రజాస్వామ్య ప్రియుల ఆకాంక్ష. కానీ ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారే ప్రమాదాన్ని అరికట్టడానికి చేసిన మినహాయింపు ఇది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా బీజేపీకి ఓటేయడ మే కాకుండా, బ్యాలెట్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాకు చూపించారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం చెప్పింది. రాజ్యసభలో బహిరంగ విధానాన్ని అమలు చేస్తున్నందువల్ల బ్యాలెట్‌ను చూపించడంలో తప్పులేదనేది బీజేపీ వాదన. ఈ వివాదాన్ని కూలంకషంగా విచారించిన ఎన్నికల కమిషన్ ఆ ఇద్దరు కాంగ్రెస్ శాసనసభ్యుల ఓట్లు చెల్లవని ప్రకటించింది. కొత్త విధానం ప్రకారం- ఓటరు తన బ్యాలెట్ పత్రాన్ని తమ పార్టీ నియమించిన ప్రతినిధికి చూపించాలే తప్ప ఇతరులకు కాదు. పార్టీ ప్రతినిధికి చూపించే నిబంధన ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యానికి కీలకమైన రహస్య ఓటు విధానం తొలిగిపోయినట్టు కాదు. ఓటు గోప్యతను, పవిత్రను కాపాడే రీతిలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన స్పష్టత ప్రజాస్వామ్యవాదులకు సంతృప్తినిచ్చేదిగా ఉన్నది. ప్రజా ప్రతినిధులు ప్రలోభాలకు గురవుతున్న నేపథ్యంలో, పార్టీ నాయకత్వానికి జవాబుదారీగా ఉండటానికి మాత్రమే రహస్య బ్యాలెట్ విధానంలో ఒక మినహాయింపును చేర్చారు. అయినంత మాత్రాన అంత బహిరంగంగా బ్యాలెట్ పత్రాన్ని ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధమే.

## అణుశక్తిపై అపోహలు తొలగించేందుకు

# 'ఎగ్జిబిషన్ ఆన్ వీల్స్'

### - ఎన్‌పీసీఐఎల్ ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృత ప్రచారం



శ్రీకాకుళం : అణుశక్తి ప్రయోజనాలు, వినియోగం, సురక్షిత లకు సంబంధించి అణుశక్తిపై బహుముఖ ప్రజా అవగాహన కార్యక్రమాన్ని న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ( ఎన్‌పీసీఐఎల్) దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున ప్రచార కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా " ఎగ్జిబిషన్ ఆన్ వీల్స్" ప్రచార కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. మొబైల్ వాహనాన్ని ఉపయోగించి పల్లెల్లో ఈ ప్రచార కార్యక్రమం ద్వారా గ్రామీణుల్లో నెలకొన్న అపోహలను, భయాందోళనలను తొలగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో పోలాకి, ఎచ్చెర్ల సెక్టార్‌లలో 156 గ్రామాలను ఈ మొబైల్ వ్యాన్ సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, పంచాయతీ కార్యాలయాలు వంటి వాటి వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సుమారు 36,000 మందికి ఈ విషయంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు నుంచి సానుకూల స్పందన లభించింది. ఈ సందర్భంగా రణస్థలం గ్రామ పెద్ద మాట్లాడుతూ ఈ ప్రాంతంలోకి అణుశక్తి కర్మాగారం రావడంతో ఈ ప్రాంత అభివృద్ధి ముమ్మరం కాగదనే విషయం ఈ అవగాహన కార్యక్రమం ద్వారా తమకు స్పష్టమైందన్నారు. రెండో దశ ప్రచారం కింద ఈ బస్సు జూలై 15 నుంచి ప్రయాణించింది. రణస్థలం మండలంలోని అపూర్వ స్పందన పొందింది. ఇక్కడ 48 గ్రామాల నుంచి 26,680 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రణస్థలం తహశీల్దార్, గ్రామ పెద్దలు, స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు ఈ ప్రదర్శనను ఎంతగానో అభినందించారు. ప్రజల్లో వున్న అపోహలను దూరం చేయడంలో ఈ ప్రదర్శన విజయం సాధించింది. ఎన్‌పీసీఐఎల్ రూపొందించిన శ్రీను సినిమా అందరినీ ఆకట్టుకుంది. ఎంతో సులభంగా, ఆసక్తిదాయక రీతిలో అణుశక్తిపై అవగాహన పెంపొందించుకోవడంలో భాగంగా కామిక్ బుక్స్, ఇతర వస్తువులు ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో 179 గ్రామాలు ఈ కార్యక్రమం కింద కవర్ చేయబడినట్టు ప్రతినిధులు తెలిపారు.

ఏది ఏమైనా ఎన్‌పీసీఐఎల్ చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అపోహాలు తొలగడంతో పాటు సంపూర్ణ అవగాహన కలుగుతోంది.

## కాపులపై కేసులు పెట్టడం అన్యాయం

ఆలమూరు :- కాపు ఉద్యమనేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభానికి మద్ధతుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న కాపులపై పోలీసులు కేసులు పెట్టడం అన్యాయమని, దీనిని విరమించుకోవాలని కోరుతూ గురువారం శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం మండల అద్యక్షుడు, రాష్ట్ర వైయస్సార్‌సిపి సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్థానిక కాపు నాయకులు పోలీస్‌స్టేషనుకు ప్రదర్శనగా వెళ్ళి ఈ మేరకు స్థానిక ఎస్.ఐ. పి.దొరరాజుకు వినతిపత్రం అందజేసారు.

ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవరాయ కాపు అభ్యుదయ సంఘం గ్రామ అధ్యక్షుడు చల్లా సత్యనారాయణ (నానాజీ), కార్యదర్శి ఎలుగుబంట్ల సాయిబాబు, నామన దుర్గాప్రసాద్, చల్లా భూషణం, కోలా నాని, పురుషోత్తం వీర్రాజు, చల్లా ఉదయ భాస్కరరావు, కొటికలపూడి నాని, కొమ్మిశెట్టి తాతారావు, పేరాబత్తుల భాస్కరరావు, సుందర బూరయ్య, గంధం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్‌కు షాకిచ్చిన కొరియా



సియోల్: అంతర్జాతీయ సంస్థలు, విదేశాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు దేశంలోకి రప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న పాకిస్థాన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. పాక్ ఆక్రమణలో ఉన్న కశ్మీర్, గిల్గిత్-బాల్టిస్థాన్‌లో పెట్టుబడులు పెట్టడానికి తాజాగా దక్షిణకొరియా నిరాకరించింది. ఈ ప్రాంతంలో చేపట్టే ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించడానికి గతంలో ఆసక్తిచూపిన కొరియా.. వివాదాస్పద ప్రాంతంలో పెట్టుబడులు పెట్టలేమంటూ ఇప్పుడు చేతులెత్తేసింది.

గిల్గిట్-బాల్టిస్తాన్, ఆజాద్ కశ్మీర్ వివాదాస్పద ప్రాంతాలు కావడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి అనేక చట్టపరమైన సంక్లిష్టతలు ఉన్నట్టు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతాలు వివాదాస్పదమే కాకుండా.. ఇవి అధికారికంగా పాకిస్థాన్ రాజ్యంలో చేరలేదు. దీంతో ఇక్కడ నివసించే ప్రజల పౌరసత్వం మొదలు అనేక విషయాల్లో సంక్లిష్టతలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతాలు తమవేనని భారత్ స్పష్టం చేస్తూ వస్తున్నది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా చేపట్టిన చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ)పై సైతం భారత్ చాలా విస్పష్టంగా తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. సీపీఈసీకి భారత్ అభ్యంతరంతో ఈ ప్రాంతంలోని ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడంపై ఇన్వెస్టర్లు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారు.

కవి సమయం

## స్వార్థపరులు ప్రజలకు మంచి చేయరు

స్వార్థం అనేది మనిషికి ఉండే దుర్గుణాలలో ఒకటి. స్వార్థం వీడితే మనిషి మనస్సు దైవత్వంతో నిండిపోతుంది. అయితే నేడు అందరిలోనూ స్వార్థం ఎక్కువైపోయింది. దేశాన్ని నడిపించే నాయకులు, అధికారులు స్వార్థంతో దేశప్రగతికి తూట్లు పొడుస్తున్నారు. నాయకులు, అధికారులు స్వార్థచింతన మానితే మనదేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. తమ వారికి మాత్రమే మేలు జరిగే పథకాలను ప్రవేశపెడుతున్నారు. తమకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అవి ఏమీ లేదు. అంతా దొంగలే. ఖరీదయిన ఖద్దరు దొంగలు కాబట్టి మనం నాయకులను ఎన్నుకొనేటప్పుడు మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం ఉన్నవారిని ఎన్నుకోవాలి. అప్పుడు మనకు మేలు కలుగుతుంది. రాజకీయ నాయకులు తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే అధికారులు కూడా సక్రమంగా పనిచేస్తారు. కానీ నేటి నాయకులు ఎన్నికలలో విపరీతంగా ధనాన్ని ఖర్చు చేసి అధికారంలోకి వచ్చాక దానికి పదిరెట్లు ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రజలు కూడా నోట్లకి ఓట్లను అమ్ముకుంటున్నారు. స్వార్థపరులగు రాజకీయ నాయకుల గురించి ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'క్రూరమృగము నడవి గూల్చ వేటయగును
క్రూరు నూర గూల్చ నేరమగును
స్వార్థపరులు చేయు చట్టము లిట్లుండు
త్రిపురనేని వాణి తెలుగుబాణి'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : శ్రావణ : బ. చవితి రా. 10-29 పూ.భా.ఉ. 06-06
త.ఉ.భా.రా.తె. 05-54 వ.మ. 03-37ల 05-12

శుక్రవారం 11-08-2017

**మేషం** : క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కాన వస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల అంతరంగిక విషయాలలో తలదూర్చకండి. **మిథునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. నిర్మాణ పథకాలలో పురోభివృద్ధి కానవస్తుంది. ఉద్యోగస్తులు తోటివారి కారణంగా అధికారులతో మాటపడవలసి వస్తుంది. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులుకు లాభదాయకం. **కన్య** : లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధుమిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమాను బంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. **వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవుతారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలిస్తాయి. **ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. **మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రిమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధికమవుతాయి. **కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. **మీనం** : ఆర్థిక విషయాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కాంట్రాక్టర్లకు అధికారులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు ఒడిదు డుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.

# పసుపు కుంకుమలతో ప్రకాశించే కాశీ విశాలాక్షి!



అయోధ్య, మధుర, హరిద్వార్, కాంచీపురం, కాశీ, ఉజ్జయిని, ద్వారక సప్త మోక్షప్రదాయికాల్లో కాశీక్షేత్రం శ్రేష్టమైనది. ఈ పుణ్యస్థలంలో మహావిష్ణువు ముక్కంటిని పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఓ సారి సూర్య భగవానుడు ఆకాశ మార్గాన్ని వెళ్తుండగా, మహా విష్ణువు కాశీలో శివలింగపూజలో లయించి ఉండటం గమనిస్తాడు. ఉమాపతి కొలువైన ఈ పుణ్య స్థలంలో పూజలు చేస్తే అత్యంత పుణ్య ఫలం లభిస్తుందని మహా విష్ణువుచే తెలుసుకుని ఆదిత్యుడు ఆ ప్రాంతంలో లింగాన్ని స్థాపించి పూజించసాగాడు. మహావిష్ణువు మాత్రమే గాకుండా, సృష్టి కర్త బ్రహ్మకూడా ఈశ్వరుని వేడు కుంటూ పది అశ్వమేథ యాగాలను చేశాడు. ఇప్పటికీ దశాశ్వమేథఘాట్ అనే పుణ్య తీర్థాన్ని కాశీలో చూడగలు గుతాం. ఈ దశాశ్వమేథఘాట్‌కు ఇప్పటికీ బ్రహ్మదేవుడు పూజలు చేస్తుంటాడని ప్రతీతి. అటువంటి ఈ పుణ్య స్థలిలో భక్తులను బ్రోచే జగన్మాత విశాలాక్షిగా కొలువైంది. ఈ శక్తిపీఠంలో విశాలాక్షి గర్భాలయంలో రెండు రూపా లతో దర్శనమిస్తుంది. ఒకరూపం స్వయంభువు. మరొక రూపం అర్చామూర్తి. మనం ఆలయంలోని ప్రవేశించగానే ముందుగా అర్చామూర్తిని, అటు పిమ్మట స్వయం భువును దర్శించుకోవాలి. పసుపు కుంకుమలతో ప్రకాశిస్తూ, పుష్పమాలాంకృతురాలైన ఆమెను భక్తులు మనసారా పూజిస్తే కోరిన కోరికలు తప్పక నెరవేరుతాయని విశ్వాసం. బ్రహ్మ దేవుని మాట ప్రకారం.. దక్షుడు తన కూతురు సతీదేవిని శివునికిచ్చి పెళ్లి చేశాడు. సతీసమేతంగా శివుడు కైలాసములో ముల్లోకవాసుల పూజలందు కుంటున్నాడు. కొంతకాలం తర్వాత ప్రయాగ క్షేత్రంలో నవ బ్రహ్మలు సత్రయాగాన్ని చేయ సాగారు. ఆ యాగానికి త్రిమూర్తులతో పాటు అష్ట దిక్పా లకులు, ప్రజాపతులు, దేవతలు, మును లంతా విచ్చేశారు. ఆ సమయంలో దక్షప్రజాపతి యాగ శాల లోకి ప్రవేశించాడు. దక్షుని రాకను చూసిన దేవతలంతా లేచి నిలబడి స్వాగతించారు. అయితే శంకరుడు కదల లేదు. శంకరుని చర్యను దక్షుడు అవమానంగా భావించాడు. శివుని చర్య వలన ధర్మం కుంటుపడుతోంది. అతడు నాకు అల్లుడైనందున శిష్యునితో సమానం. కాబట్టి నేను వచ్చినప్పుడు లేచి నిలబడి నన్ను గౌరవించాలి. నా కూతురిని ఇటువంటి దిగంబరికి, ఎముకలను నగలుగా ధరించేవానికి ఇచ్చినందుకు చింతిస్తున్నాను. ఇకపై ఇతని యాగాలలో

సంకీర్తన

హవిర్భాగాలు ఉండవని దక్షుడు నిందించాడు. అప్పటికీ శివుడు మౌనంగానే ఉన్నాడు. ఈ సంగతిని విన్న నందీశ్వరుడు కోపంతో దక్షుని ముఖం మేక ముఖమై పోతుందని శపిస్తాడు.

నందికి కూడ హవిర్భాగాలు లేవని దక్షుడు మళ్లీ నిందించాడు. అంతటితో దక్షుని కోపం చల్లారలేదు. బృహస్పతి సవనమనే మహాయాగాన్ని చేయ సంకల్పించి, ఆ యాగానికి సమస్త దేవతలను ఆహ్వానాలు పంపాడు. కానీ తన కుమార్తెన సతీదేవికి, అల్లుడు శివునికి ఆహ్వానాలు పంపించలేదు. యజ్ఞానికి దేవతలంతా వచ్చారు. అందరూ దక్షుని యజ్ఞానికి శివుడు ఎందుకు రాలేదని ప్రశ్నించ సాగారు.

అందుకతడు శివుని రకరకాలుగా తూలనాడసాగాడు. దేవతలు దాన్ని సహించలేకపోయారు. ఈలోపు కైలాసంలో ఉన్న సతీదేవికి తన తండ్రి చేస్తున్న యాగానికి తనను ఆహ్వానించలేదనే కోపంతో, శివుని మాటను సైతం లెక్క చేయకుండా యజ్ఞశాలకు వెళ్లి, అక్కడ తండ్రిచే అవమానింపబడి యోగాగ్నిలో దగ్ధమైంది. ఆ సంభవాన్ని చూసిన రుద్రగణాలు యాగశాలను బీభత్సం చేయసాగాయి.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యములో

# విద్యాసంస్థలు బంద్



కొత్తవలస: స్థానిక ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యములో జరిగిన విద్యసంస్థలు బంద్ కార్యక్రమము గురువారం మండలంలో విజయవంతమైనది. ఎస్.ఎఫ్.ఐ డివిజన్ స్కూల్ నుంచి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు దీర్ఘకాల సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తం బంద్ చేపట్టిన పిలుపుమేరకున్న ప్రముఖ్యత వైఫల్యాలు పాఠశాలలు బంద్ పాటించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలివల్సిందిగా ఎస్.ఎఫ్.ఐ ఉమ్మడి చేసింది.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించి విద్యార్థులను ఆదుకోవాలి, గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ హస్టల్స్‌లు మెరుగైన సదుపాయములు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయ కులు జోష్న వరలక్ష్మి, ఎస్.ఎఫ్.ఐ మహిళ కన్వీనర్ బి.జ్యోతి పాల్గొన్నారు.

### బాలల సంరక్షణ కేంద్రాల

# రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

విజయనగరం: బాలల సంరక్షణ కోసం నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాల్సిందేనని జిల్లా పరివీక్షణాధికారి బి.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్లకు గతంలో ఆగస్టు 10వ తేదీ చివరితేదీగా ప్రకటించడం జరిగిందని అయితే పలు స్వచ్ఛంద సంస్థలు కోరిక మేరకు ప్రొబిషన్ సంచాలకులు ఈ రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించారని జిల్లా పరివీక్షణాధికారి వివరించారు. ఈ అవకాశాన్ని బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయదలచినవారు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

# అట్టహాసంగా ప్రీస్కూళ్ల ప్రారంభం

### ఆందోళనలో అంగన్వాడీలు



ప్రీస్కూల్స్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అనిత

నర్సీపట్నం : అట్టహాసంగా పట్టణంలో అంగన్వాడీ ప్రీస్కూళ్లను ప్రారంభించారు. ఇప్పటికే మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన కేంద్రంకే ఎవరూ రాకపోవడం తెలిసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిదులు మరొక అడుగు ముందుకేసి గురువారం ఐదు కేంద్రాలను ప్రారంభించారు. బిసి కాలనీలో నాలుగు కేంద్రాలను కలిపి 184 మంది లబ్ధిదారులతో కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్శన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడులు ప్రారంభించారు. ఎస్సీ న్యూ కాలనీలో రెండు కేంద్రాలతో 88మంది లబ్ధిదారులు, రామారావుపేటలో 3 కేంద్రాలు, 94 మంది, బలిఘట్టంలో 3 కేంద్రాలు 89 మంది, పెదబడ్డేపల్లిలో 3 కేంద్రాలు 72 మంది లబ్ధిదారులతో ఈ కేంద్రాలను ప్రారంభించారు. కాగా 15 అంగన్వాడీ కేంద్రాలను వెరసి ఐదు కేంద్రాలుగా చేశారు. ఇందులో 117 మంది గర్భిణీలు, 108 మంది బాలింతలు, 116 మందికి నర్సరీ, 98 మందితో ఎల్‌కేజి, 78 మందితో యుకేజి లను నిర్వ హించాల్సి ఉంది. మొత్తం లబ్ధి దారులు 537 మంది. మొదట్లో ప్రారంభించిన కేంద్రానికి టీవీలు, మరుగు దొడ్లు, యూనిఫారాలు, పుస్తకాలు ఇచ్చి అట్టహాసంగా జరిపారు. ప్రస్తుతం పాత కేంద్రం లోనే ఉండి కొత్త కేంద్రా లకు తెచ్చి పెట్టడం చిక్కులుగా మారింది. లబ్ధిదారులు రాకపోవడం మరింత ఇరకాటంలో పడేసింది. కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గింది. మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాలు కూడా చేశారు. ప్రభుత్వం ఆదేశించింది. పని చేయాల్సిందేనంటూ పని చేసుకుంటూ పోతున్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సిడిపిఒ ఎం.శ్రీకళ, ఏసిడిపిఒ జివి.రమణి, సూపర్‌వైజర్ విజయ లక్ష్మితో పాటు ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లు పాల్గన్నారు. ఏర్పాట్లపై కనీసం దీపస్తంభంలోని ఒత్తి వెలిగించడానికి అగ్గి పెట్టె కూడా మేమే తేవాలా..అని మున్సిపల్ వైస్ చైర్మన్ ఐసిడిఎస్ అధికారులకు చివాట్లు పెట్టడం జరిగింది.

# ఆనూరు దళితులకు ఇండ్ల పట్టాలు ఇవ్వండి

పెద్దాపురం: ఆనూరు దళితులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహశీల్ధార్ వరహాలమ్మలకు ఆనూరు గ్రామ దళితులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనూరులో 73-3 సర్వేనెంబరులో 3 ఎకరాల 34 సెంట్లు భూమిలో 2 దశాబ్ధాలుగా 105 దళిత కుటుంబాలు పూరిగుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి కనీస సౌకర్యాలైన మంచినీరు. రోడ్లు, వీధిలైట్లు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, దీంతో పారిశుధ్యం లేక అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. వీటికై అధికారులను ఎన్నిసార్లు వేడుకున్న ఫలితం లేకపోయినదని, ఇకనైనా వెంటనే సమస్యలు పరిష్కరించి సహకరించాలని రైతు కూలీ సంఘం సభ్యులు కోరారు.

### రైతు సేవలో

# రెవెన్యూ శాఖకు అనూహ్య స్పందన

విజయనగరం: జిల్లాలో ప్రతి గురు, శుక్రవారాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందని సంయుక్త కలక్టర్ శ్రీకేష్ లత్కర్ పేర్కొన్నారు. గురువారం పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామంలో నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమంలో పాల్గొన్న సంయుక్త కలక్టరు మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా రెవెన్యూ శాఖ కృషి చేస్తోందని, అందులో భాగంగా వారి గ్రామాలలోనే రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం నిర్వహించి అక్కడికే రెవెన్యూ అధికారులను పంపించడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా టైటిల్ డీడ్స్‌లో పేర్లు మార్పు, ఎలక్ట్రానిక్ పట్టాదార్ పాసుసుస్తకాలు, అడంగళ్, పాసుపుస్తకాల్లో తప్పుల సవరణ, డి-పట్టా పాసుపుస్తకాలు, రిజిస్టర్ కాని డాక్యుమెంట్ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై రైతులు స్పందించి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అదే విధంగా అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి ఫిర్యాదుదారునకు తెలియజేయాలని ఈ సందర్భంగా జెసి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎర్నాయుడు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఇంటర్వ్యూలు



రుణాల కోసం జరుగుచున్న ఇంటర్వ్యూలు

లక్కవరపుకోట: ఈ మండలంలో జి.సి., కాపు కార్పోరేషన్ రుణాలకు సంబందించి గురువారం ఇంటర్వ్యూలు ముగిశాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పి.డి.ఓ. రమణమ్మ, కొత్తవలస, లక్కవరపుకోట ఏ.పి.జి.వి. బ్యాంకు మేనెజర్లు గౌరీశంకరజీ, సునీత ఇంటర్వ్యూలు నిర్వహించారు. బి.సి. లకు 162, కాపులకు 20 రుణాలు ఈ ఏడాది అందివ్వడానికి నిర్ణయించారు. ఒక్కొక్క యూనిట్ విలువ రెండు లక్షల రూపాయలు. ఇందులో సబ్సిడీ లక్షరూపాయలు. బి.సి. రుణాలకు 531 మంది, కాపు రుణాలకు 112 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరూ ఇంటర్వ్యూలకు హజరయ్యారు. ఇదిలా ఉండగా ఎస్.సి., మైనార్టీ, కార్పోరేషన్ రుణాలకు సంబంధించి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్ణయించనున్నారు.

# నకిలీ విజిలెన్సు అధికారి అరెస్టు

లక్కవరపుకోట: అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ విజిలెన్సు అధికారి మెట్ట చెన్నంనాయుడు ఇక్కడ డీలర్లు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంగతి విదితమే. ఈమేరకు వీరభద్ర పేట గ్రామ రేషను డిపో డీలరు కృష్ణయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు హెచ్.సి. నాగేశ్వవరరావు బుధవారం కేసు నమోదు చేశారు. గురువారం నకిలీ విజిలెన్సు అధికారి చిన్నంనాయుడు, కేసులో మరో నిందితుడు అయిన ఆటోడ్రైవరు వై. ఎర్రిబాబును పోలీసులు అరెస్టు చేశారు.

### పురాతన ఆలయాల సంరక్షణ

# అందరి బాధ్యత

పెద్దాపురం: పురాతన ఆలయాల సంరక్షణ అందరి బాధ్యత అని హోంమంత్రి చినరాజప్ప అన్నారు. పెదబ్రహ్మదేవం గ్రామ దేవతలు, మారెమ్మ, సోమాలమ్మ ఆలయ నిర్మాణాలను గ్రామస్తుల సిజియస్ రూ.40లక్షలతో చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, రామకృష్ణ, నాగరాజు, సత్తిబాబు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలు బంద్

పెద్దాపురం: చంద్రబాబు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం పెద్దాపురం పట్టణంలో గల అన్ని కాలేజీలు, స్కూళ్ళు బంద్‌లో పాల్గొన్నాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) నాయకులు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 2వేలకు పైగా సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఎత్తివేశారని, దీనివలన పేద విద్యార్థులు విద్యను కోల్పోయారని అన్నారు. విద్యాలయాలతో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, మయూరి, భానుతేజ, పవన్, నాని, వీరు తదితరులు పాల్గొన్నారు.

### శిల్పామోహన్ రెడ్డి విజయం

# రాష్ట్రానికే స్ఫూర్తిదాయకం కావాలి

### ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: నంధ్యాల ఉప ఎన్నిక పార్టీ అభ్యర్థి శిల్పామోహన్ రెడ్డి విజయం రాష్ట్రానికే స్ఫూర్తిదాయకం కావాలని శాసనమండలి సభ్యులు, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వినియర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారంనాడు నంధ్యాల పట్టణం లోని పలు వార్డులలో శిల్పామోహన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. 31/2 ఏండ్ల చంద్రబాబు పాలనలో దౌర్జన్యాలు, హత్యలే మిగిలాయన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందన్నారు. నంధ్యాలపై కపట ప్రేమ నటిస్తున్నారన్నారు.సామాన్యుల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిం దన్నారు. టి.డి.పి. ప్రజాప్రతినిధుల దౌర్జన్యాలు, దుర్మార్గాలు పరాకాష్టకు చేరాయన్నారు. ఇసుక, లిక్కర్, రియలేస్టేట్, మట్టి ఆయా రంగాలు మాఫియా కనుసన్నులలో నడుస్తున్నాయన్నారు. ఇందులో టి.డి.పి. ఎమెల్యే, ఎమ్మేల్సీలు పాత్రదారులు కావడం టిడిపి మాఫియా పాలనకు నిదర్శనం అని అన్నారు. రాజన్న రాజ్యం, శాంతియుత పాలన కావాలంటే శిల్పామోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన ఆవశ్యకత, అవసరం నంధ్యాల ప్రజలపై ఎంతైనా ఉందన్నారు. వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలు పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని పార్టీ కార్యకర్తలకు కోలగట్ల పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ద్యేయంగా పోరాడుతున్న జగన్‌మోహన్ రెడ్డికి బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ ద్వారకానాధ్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి మెట్టపల్లి రమేష్, 40వ వార్డు కౌన్సిలర్ ఎస్.పి. కిరణ్, విజయనగరం జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సంగంరెడ్డి బంగారునాయుడు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్సీ మాధవ్ జన్మదిన వేడుకలు

### అనాధ వృద్ధులకు భోజన వితరణ చేసిన బిజెపి నాయకులు



అనాధ వృద్ధులకు భోజన వితరణ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యులు పివిఎన్.మాధవ్ జన్మదిన వేడుకలు నర్సీపట్నం నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం బిజెపి నాయకులు ముందుగా ఎమ్మెల్సీ మాధవ్ గారి స్వగృహాలోకి విశాఖలో వెళ్లి జన్మదిన శుబాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం నర్సీపట్నం టౌన్‌లో ఉన్న అనాధవృద్ధులకు, మహిళలకు, వికలాంగులకు, భోజన వితరణ, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవుడి సేవయే మాదవుడి సేవగా భావించి ఆయన జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిం చామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్ కాళ్ల సుబ్బా రావు, జిల్లా కార్యదర్శి బంగారు ఎర్రినాయుడు, పట్టణ అధ్యక్షులు పాకలపాటి అరవింద్‌కుమార్, గొలుగొండ బిజెవైఎం మండల అధ్యక్షులు కె.దివాకర్, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అధికారం కోసం...

# కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టొద్దు



విశాఖపట్నం : అధికారం కోసం కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టొద్దని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జగన్‌కు హితవు పలికారు. టీడీపీని నేరుగా ఎదుర్కొలేక సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లతో కుతంత్రాలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. జగన్, ప్రశాంత్‌కిషోర్‌లు తమ నడవడికలను మార్చుకోవాలని హితవు పలికారు.

లేకుంటే ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వీరి తీరుకు నిరసనగా ఎమ్మెల్యే వాసుపల్లి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు వినూత్న రీతిలో నిరసన తెలిపాయి. అనంతరం జివియంసి గాంధీ విగ్రహం ముంగిట మౌనంగా నిరసన తెలిపారు.

# మెస్ ప్రకారం భోజనాలు వండాలి




భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గరివిడి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెస్ ప్రకారం వంటలు వండి విద్యార్థులకు సరిపడా భోజనాలు పెట్టాలని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని అన్నారు. మండలంలో కొండ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం అకస్మికంగా తనిఖీ చేసారు. భోజనాల కోసం వంటలు ఏ విధంగా వండుతున్నారు.

ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులకు సరిపడినంత కాకుండా తక్కువగా వంటలు వండుతున్నట్టు ఎమ్మెల్యే గుర్తించారు. పాఠశాల హెచ్.ఎమ్ తో మృణాళిని మాట్లాడుతూ వంటలు వండుతున్నప్పుడు ఎంత మోతాదులో నిర్వాహకులు చేస్తుంది గమనించలన్నారు. విద్యార్థులకు అరకోరగా భోజనాలు పెడితే వారు ఏ విధంగా చదవగలరు అని ఎమ్మెల్యే తన అసహనాన్ని వ్యక్తం చేసారు. పరిస్థితిని చక్కదిద్దాలని హెచ్.ఎమ్‌ను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థులకు మంచి విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి ఎంపిపి పై.ల. సింహాచలం, ఎంపిడిఒ అన్నపూర్ణాదేవి, ఎంపిటిసి కంతాడ రవికుమార్, ఆర్.ఈ.సి.ఎస్ వైస్ చైర్మన్ సారిపాక సురేష్ కుమార్, అడపా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# సింహాద్రినాధుని దర్శించుకున్న ప్రముఖులు



సింహాచలం : సింహగిరిపై కొలువై ఉన్న వరహ లక్ష్మీ నరసింహ స్వామివారిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనురాధ ఐఏయస్, కమర్షియల్ టాక్స్ సెక్రటరీ నాగరాణి ఐఏఎస్, ధర్మాదాయ శాఖ సుబ్బారావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం సహాయ కార్యనిర్వాహణాధికారి ఆర్వివిఎసెన్ ప్రసాద్ పూలమాల వేసి స్వాగతం పలికారు. అర్చకస్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. తరువాత కప్పస్థంభం ఆలింగనం చేసుకున్నారు. అనంతరం వేదనాదాల నడుమ బేడా ప్రదక్షణ చేసారు. తమగోత్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం ఆలయ పర్యవేక్షకులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# రుణాలును సద్వినియోగం పరుచుకోవాలి

### ఎమ్‌పిపి మాసవరపు అప్పలనాయుడు



పరవాడ : ప్రభుత్వం బ్యాంక్ లు ద్వారా అందిస్తున్న రుణాలును లబ్దిదారులు అందరూ సద్వినియోగం పరిచికోవాలిని మండల పరిషత్ అద్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు పిలుపునిచ్చారు.

మండల పరిషత్ కార్యలయం సమావేశ మందిరములో గురువారం జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులుతో ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం యస్ సి,బిసి, మైనార్టి, కాపు కార్పోరేషన్లు ద్వారా నిరుద్యోగ యువతను అదుకునుందుకు రుణాలును మంజురు చేస్తుం దన్నారు. అర్హులైన నిరోద్యోగులుందరూ ఈ రుణాలును సద్వినియోగం పరుచు కోవాలిన్నారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో వడ్డి చెల్లించాలన్నారు.

యస్ సి, కార్పో రేషన్లు 77, బిసి కార్పోరేషన్లు 350, కాపు28,మైనార్టిలు15 వచ్చాయి. ఈ కార్య క్రమంలో జెడ్ .పి.టి.సి-పైల జగన్నాదరావు, భరిణికం సర్పంచ్ బొండా. తాతరావు,పరవాడ ఎమ్.పి.టి.సి- సిరిపూరపు. అప్పలనాయుడు, ఎమ్ .డి.ఒ,ఇ.ఒ.అర్ .డి,తదితర్లు పాల్గొన్నారు.

# గిరియంపేటలో విద్యార్థుల ర్యాలీ

యానాం : గిరియంపేట పురవీధుల్లో పడే భారత్, బడే భారత్ అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గురువారం విద్యాశాఖ పరిధిలో సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో పడే భారత్, బడే భారత్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పిన్వింగ్ అప్ స్కూల్స్ కార్యక్రమం నాల్గవ రోజుకు చేరుకుంది. నారాయణ ఈ -టెక్నోస్కూల్ విద్యార్థులు గిరియంపేట పెరుంతలైవార్ కామరాజ్‌నాడర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు గిరియంపేట పాఠశాల విద్యార్థులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల విద్యార్థులు వినూత్నంగా, వినోదంగా ఎద్దుల బండిపై ఊరేగింపుగా గిరియంపేట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో ఉన్న ఐసిటి ల్యాబ్‌ను, జాతీయ నాయకుల చిత్రాలను తిలకించారు. దగ్గరలో ఉన్న పంటపొలాలను, రొయ్యల చెరువులను, మడఅడవులను యానాం ఓబ్లిక్ టవర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి కాలేసాయి నాథ్, సర్వశిక్షాభియాన్ కో ఆర్డినేటర్ కమిడి ప్రభాకర్‌రావు, నారాయణ ఈ-టెక్నోస్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, గిరియంపేట పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శశికాంత్ వర్మ, పి. జయరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### సరస్వతీ సమన్వయ సమితి ఆధ్వర్యంలో

# 14న సినీదర్శకుడు విశ్వనాథంకు సన్మానం



కాకినాడ : దాదాసాహెబ్‌పాల్కే అవార్డు గ్రహిత, కళాతపస్వి, విశ్వవిఖ్యాత దర్శక సార్వభౌముడు, ప్రముఖ సినీ దర్శకుడు పద్మశ్రీ డా. కాశీనాథుని విశ్వనాథ్‌కు ఈ నెల 14న సరస్వతీ సమన్వయ సమితి ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళా మందిరంలో ఆత్మీయ అభినందన విజయోత్సవ సన్మానం జరుగుతుందని కమిటీ సభ్యులు ప్రముఖ పారిశ్రామిక వేత్త దంటు సూర్యారావు తెలిపారు. గురువారం స్థానిక సూర్యకళా మందిరంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ విశ్వనాథ్ సినీ దర్శకునిగా, అశ్లీలతకు తావులేకుండా ఎన్నో విజయవంతమైన సాంప్రదాయమైన చిత్రాలను రూపొందించారని ఆయన ప్రతిభను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల దాదాసాహెబ్ పాల్కే పురస్కారాన్ని అందించారన్నారు. భారత దేశ సాంస్కృతిక, సాంప్రదాయాలను ప్రపంచదేశాలకు చాటిన విశ్వనాథ్‌కు సముచిత రీతిలో సన్మానం చేయనున్నామన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సినీ చరిత్రకారుడు విశ్వనాథ్ రూపొందించిన లఘుచిత్ర ప్రదర్శన జరుగుతుందన్నారు. తమ కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణ కంకణం మహూకరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌తో ముఖాముఖి ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విశిష్ఠఅతిథి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించడం జరుగుతుందన్నారు. వ్యాఖ్యాతగా ఎస్‌వి. రామారావు వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలోచాడ శంఖరప్రసాద్ (తొండంగి బాబి) ఆంజనేయమూర్తి, ఆర్ఎస్ఆర్ ఆంజనేయులు, వెంకటేశ్, లీలాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



**కాకినాడ నగర పాలక సంస్థ 28వ డివిజన్ తెలుగుదేశం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న సుంకర భవానీ. ఆమె వెంట ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, తెదేపా నగర అధ్యక్షుడు సుంకర తిరుమలరావు తదితరులు.**

# ప్రారంభమైన రిజినల్ టేబుల్ టెన్నిస్ పోటీలు

యానాం: మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయల్లో రెండు రోజులపాటు రిజినల్ టేబుల్ టెన్నిస్ పోటీలను పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు ప్రారంభించారు. గురువారం ఉదయం నవోదయ విద్యాలయ క్రీడా మైదానంలో టేబుల్ టెన్నిస్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు చెందని 8 కస్టర్ల నుండి సుమారు 230 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తొలిత పోటీల్లో కర్నాటక, తెలంగాణ కస్టర్లమధ్య ప్రారంభంమయ్యింది. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 25, 27 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలో అళ్వర్ నవోదయలో జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుమారు 30 మంది క్రీడాకారులు పాల్గొనన్నుట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా పరిపాలనాధికారి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు పట్ల ఆసక్తిని పెంపొందించుకొని రాణించాలన్నారు. ఆరోగ్యం, మానసిక ఉల్లాసం క్రీడలవల్లనే సాధ్యం అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. తద్వారా ఆయా రాష్ట్రాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

# గోశాలను సందర్శించిన

### ఎండోమెంట్ కమీషనర్ అనూరాధ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధీనంలో చెందుర్తిలో గల గోశాలలో ఉన్నటువంటి 129 గోవులను ఎండోమెంట్ కమీషనర్ అనూరాధ విజయవాడ వెళ్లుతూ మార్గమద్యలో ఉన్న చెందుర్తి గోశాలను పరిశీలించి వాటి బాగోగులను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈవో ఈరంకి .జగన్నాధరావు, చైర్మెన్ రాజా ఐవి రోహిత్, ఎఇవో ప్రసాద్, ఈవో సిసి గణపతి, సతీష్ , డిఇ నూకరత్నం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జె.హరికిరణ్‌కు 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు



కాకినాడ : పరిశీలకుల బృందం సిఫార్సు మేరకు జె.హరికిరణ్ సిద్ధాంత వ్యాసం "ఎఫీషియంట్ టెక్నిక్స్ ఫర్ మైక్రోఎరేయ్ ఇమేజ్ అనాలిసిస్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో లభించినది. జె.హరికిరణ్ తన సిద్ధాంత వ్యాసాన్ని విశాఖపట్నంలోని గీతం యూనివర్శిటీ ఐటి ప్రొఫెసర్ డా.పి.వి.లక్ష్మి మరియు మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఆర్.కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు. ప్రస్తుతం జె.హరికిరణ్ విశాఖ పట్నంలోని గీతం యూనివర్శిటీ నందు ఐటి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# సరికొత్తగా మార్కెట్‌లోకి యిప్పీ

విశాఖపట్నం : ఆహార ఎంపికపై ఆధారపడి నేటి రోజులలో ఐటిసి ఫుడ్స్ సరికొత్త సన్‌ఫీడ్స్ యిప్పీ మూడ్ మసాలాన్ని ప్రారంభించినట్లు ఐటిసి ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ హేమంత్ మాలిక్ తెలిపారు. ఐటిసి ఫుడ్స్ వద్ద సలక్షణమైన, వైవిద్యమైన ఆహ్లాదకరమైన ఆహార అనుభవాలను వినియోగదారులకు ఇవ్వాలని ఆరాటపడుతున్నారని అన్నారు. ప్రజల మూడ్‌పై ఆధారపడితినే ఆహారాన్ని నచ్చిన రీతిలో చేసుకునేవిధంగా చేసుకుంటారని తెలిపారు. క్రొత్త సన్‌ఫీడ్స్ మూడ్ మసాలాతో రుచిని ప్రతిసారి ఎంచుకోవాలని ప్రతి ఒక్క మూడ్ మసాలా ప్యాకెట్‌లోని రెండు మసాలా మిక్స్ శ్యాషేస్ వాడి నూడిల్స్‌ని మీకు నచ్చిన రీతిలో చేసుకోవచ్చుని తెలిపారు.

# విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



రావులపాలెం : రాష్ట్ర ఎస్.ఎఫ్.ఐ., పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ సంస్థలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం విద్యాసంస్థలు మూతపడ్డాయి. ప్రభుత్వం విద్యారంగంలో ఏళ్లతరబడి మూలుగుతున్న సమస్యలను పరిష్కరించాలంటూ విద్యార్థి సంఘాలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ , కళాశాలలు మూసివేసారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులతో జాతీయరహదారిపై మానవహారంగా ఏర్పడి ప్లేకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేసారు. అదేవిధంగా ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల మూసివేత చర్యలు వెంటనే మానుకోవాలని, ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్‌చార్జీలను పెంచాలని, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘల ప్రతినిధులు కె. ప్రేమ్ కుమార్, కె. పవన్‌కుమార్, పి. వినోద్, సిహెచ్.రాహుల్, ఎ. వెంకటేష్, వి. చైతన్య, టి.వెంకటేష్, ఎ. సతీష్‌రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గాడు అప్పలనాయుడుని పరామర్శించిన గంటా



భీమునిపట్నం : భీమునిపట్నం టిడిపి నాయుకుడు రాష్ట్ర జానపదా కళాకారుల సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడుని మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు, పలువురు నాయకులు పరామర్శించిరు. ఆయన ఇటీవల ప్రమాదవసాత్తు బండిమీద నుండి పడిపోవడం వల్ల కాలు నరాలకు ఎయర్‌క్రేక్ అయింది ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇందులో టిడిపి జోన్ అధ్యక్షులు గంటానూకరాజు, యరబాల అనీల్ ప్రసాద్, ఎం షణ్ముకరావు, పి.యోగి, డి శ్రీను, ఆదర్శ హిందీ ప్రేమి మండటి అధ్యక్షులు కె ఎస్ ఆర్ క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌గా

### మహాత్మాగాంధీ బాలుర ఉన్నత పాఠశాల

యానాం : అన్ని వసతులు ఉన్న మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపికచేయనున్నట్లు సర్వ శిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మొహెందర్‌పాల్, కో ఆర్డినేటర్ జార్జ్‌ఫెర్నాండేజ్ తెలిపారు. పడే భారత్, బడే భారత్ కార్యక్రమాన్ని ప్రారంభిం చేందుకు వచ్చిన మొహెందర్ పాల్ బృందం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీచేశారు. ఈ ఏడాది జనవరిలో వజ్రోత్స వాలు చేసుకున్న మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మరింత అభివృద్ధి చేయడానికి మోడల్ స్కూల్‌కి ఇచ్చే నిధులు ఉపయుక్తం అవుతాయన్నారు. విద్యార్థులలో చదవాలన్న పోటీతత్వం తల్లిదండ్రులు రగిలిస్తే వారిని చక్కగా తీర్చిదిద్దే అనుభవజ్ఞులైన, సుసిక్షితులైన ఉపాధ్యాయులు, ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారన్నారు. తెలుగుతోపాటు, ఆంగ్లమాధ్యమం అన్నిచోట్ల అందుబాటులో ఉంటున్న ప్రభుత్వ పాఠాలలో చేర్పించాలని మొహిందర్‌పాల్ విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమం లో విద్యాశాఖ అధికారి కాలే సాయినాద్, సర్వశిక్షాభియాన్ కో-ఆర్డినేటర్ కమిటి ప్రభాకర్, నక్కా వసూదేవరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్‌సీపి తరుపున కంపర రమేష్ నామినేషన్



కాకినాడ : వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ తరుపున కంపర రమేష్ నామినేషన్ 9వ డివిజన్ అభ్యర్థిగా నామినేసన్ దాఖలు చేశారు. శుక్రవారం రమేష్ తన అనుచరగణంతో స్థానిక శాంతికగర్‌లోని శ్రీరామకృష్ణ పబ్లిక్ స్కూల్ లోగల నామినేషన్ కేంద్రానికి వచ్చి రిటర్నింగ్ అధికారి కె.భీమేశ్వర రావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ తరుపున పోటీచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాకినాడ నగర పాలక సంస్థలో వైఎస్ఆర్ పార్టీ విజయ బావుటా ఎగుర వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కాకినాడ నగర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్న రమేష్ గత రెండు రోజుల క్రితం వైఎస్ఆర్‌పార్టీ కాకినాడ కో ఆర్డినేటర్లు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ముత్తా శశిధర్‌ల సమక్షంలో ఆపార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరారు.

# కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

భీమునిపట్నం : ఈ నెల 11, 16, 17, 18. 19 తేదీలలో స్వయంఉపాధి పథకంలో భాగంగా బి.సీ., ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాలను 2017-18 సంవత్సరానికి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్నవారికి పై తేదీలలో ఆయా బ్యాంకుల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని భీమిలి ఎంపిడిఒ కె. హరిప్రసాదరావు తెలిపారు. 11వ తేదీన ఉదయం 11 గంటల నుండి మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఎంపికకు దరఖాస్తుదారులు హజరు కావాలని ఆయన కోరారు. 21 పంచాయతీల నుంచి 730 దరఖాస్తులు రాగా 14 బ్యాంకుల అధికారులు ఎంపికచేస్తారన్నారు. 11వ తేదీన అన్నవరం, పెదనాగమయ్యపాలెం పంచాయతీల లబ్ధిదారులకు కార్పొరేషన్ బ్యాంకు తగరపువలస, అమనాం పంచాయతీకి ఎపి గ్రామీణ వికాస బ్యాంకు భీమునిపట్నం, జె.వి. అగ్రహారం పంచాయతీకి దేనాబ్యాంకు బొడ్డపాలెం బ్రాంచి అధికారలు ఎంపికచేస్తారన్నారు. 16న లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో ఎపి గ్రామీణ వికాస బ్యాంకుచిట్టివలస, 17న తాళ్లవలస పంచియతీకి ఎపి గ్రామీణ వికాస బ్యాంకు వారు తాళ్లవలస, 18న టి.నగరపాలెం పంచాయతీకి ఆంధ్రా బ్యాంకు తగరపువలస, దాకమర్రి పంచాయతీకి ఎస్‌బిఐ చిట్టివలస, నారాయణరాజుపేట, శింగనబంద పంచాయతీలకు ఎస్‌బిఐ తగరపువలస, రేఖవానిపాలెం, మూలకుద్దు పంచాయతీలకు ఆంధ్రా బ్యాంకు భీమునిపట్నం, తాటితూరు పంచాయతీకి ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్, తగరపువలస, 19న మజ్జిపేట, మజ్జివలస పంచాయతీలకు ఎస్‌బిహెచ్ తగరపువలస, కాపులుప్పాడ, కె. నగరపాలెం పంచాయతీలకు యునియన్ బ్యాంకు మంగమారిపేట, నిడిగట్టు, చేపలుప్పాడ పంచాయతీలకు ఎస్‌బిఐ, భీమునిపట్నం, చిప్పాడ పంచాయతీకి ఆంధ్రా బ్యాంకు చిప్పాడ బ్యాంచ్‌లను కేటాయించారు.

# రడీమేడ్ వ్యక్తిగత మరుగుదొడ్లు సురక్షితం

రావులపాలెం : రావులపాలెం, కొత్తకాలనీలో మై మార్గ్ కంపెనీచే రడీమేడ్ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణ నమూనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రడీమేడ్ వ్యక్తిగత మరుగుదొడ్లు ధృఢముగాను, సౌకర్యవంతంగాను ఉంటాయని వారు ప్రజలకు వివరించారు. ఈ సందర్భముగా ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ నిర్మించుకోకుండా ఉన్నవారు ఇటువంటి మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకొనుటకు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య, జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్, తహశీల్దార్ సిహెచ్ ఉదయ భాస్కర్, సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, ఫీల్డు అసిస్టెంట్లు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు




కాకినాడ : కాకినాడ సూపర్ స్టార్ మహేష్ బాబు యువసేన ఆధ్వర్యంలో ప్రిన్స్ మహేష్ బాబు 42వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గొడారి గుంటల సెంటర్ నందు అభిమానుల కేరింతల మద్య మహేష్‌బాబు యువసేన నగర అధ్యక్షుడు కర్రి మోహన్ భారీ కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ఉమా మనోవికాస కేంద్రం విద్యార్థులకు అన్నదానం చేశారు.

ఈ సందర్భంగా అభిమానులు మహేష్ బాబు ఫొటో ఉన్న టీ షర్టులుదారణ ఆకర్షణీయంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పి.రాజు, ఎం.రాజు పి.రాజేష్ ఎన్. సాయి ప్రసాద్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సంఘం పార్టీలకు అతీతం



విజయనగరం : విజయనగరం స్థానిక మయూరి కూడలిలో జరిగిన గ్రామీణ వైద్యుల సంఘం రాజకీయ పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తుందన్న సమావేశంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చంగం.జోషి మాట్లాడుతూ ఇటీవల తెలుగునాడు గ్రామీణ సంక్షేమ సంఘం పేరుతో వచ్చిన పత్రిక ప్రకటనపై స్పందిస్తూ అసలు తెలుగునాడు పియంపి అంటూ లేదని రాష్ట్రంలో తెలుగునాడు పారామెడిక్స్ మాత్రమే ఉందని అన్నారు. ఇటీవల జరిగిన మా సమావేశంలో ముఖ్యమంత్రి వర్యులను ఎన్నికల మ్యానుఫెస్టులో పెట్టిన 85 వ హమీని గ్రామీణ వైద్యుల గుర్తింపును పునరాలోచించాలని అన్నామే తప్ప ముఖ్యమంత్రి వర్యులపై బురద జల్లే కార్యక్రమం కాదని తెలిపారు. ముఖ్యమంత్రి వర్యులు నూతన రాజధానిలో అయన చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ వైద్యులలో కూడా తెలుగుదేశం పార్టీ తరుపున పోటీచేసి గెలిచిన ఎమ్ పిటిసిలు, సర్పంచి,జెడ్ పిటిసిలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారని గుర్తుచేసారు. అదేవిధంగా గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గెడ్డ.చిరంజీవి మాట్లాడుతూ ఏ సంఘం అయినా సరే సభ్యులను తప్పుదారిని పట్టించరాదని సంఘ సభ్యుల సంక్షేమము కోసం పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఐ.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## ‘బాడ్కావ్ బలిసిందారా’

### సాయి పల్లవి డైలాగ్ అర్ధం తెలిస్తే షాక్!



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఫిదా’ సినిమా పెద్ద హిట్. ఈ సినిమా ఇంత పెద్ద హిట్టయిందంటే.... ప్రధాన కారణం సాయి పల్లవి. ఆమె సినిమాలో మాట్లాడిన తెలంగాణ యాస. భవిష్యత్తులో ఈ సినిమా గురించి అందరూ మరిచిపోయినా సాయి పల్లవి క్యారెక్టర్, ఆమె చెప్పిన డైలాగులు ఎప్పటికీ గుర్తిండిపోతాయి. ఈ సినిమాలో సాయిపల్లవి ఓ సీన్లో ‘బాడ్కావ్ బలిసిందారా... బొక్కలిరగ్గొడతా’ అంటూ ఓ వ్యక్తిని తిడుతుంది. ఈ డైలాగ్ బాగా పాపులర్ అయింది. ఈ డైలాగులో బలిసిందారా, బొక్కలిరగ్గొడతా అర్థం అందరికీ తెలిసిందే కానీ ‘బాడ్కావ్’ అంటే ఏమిటో చాలా మందికి తెలియదు. చాలా మంది ఈ పదం అర్థం కోసం నెట్లో అన్వేషిస్తున్నా సరైన జవాబు దొకరడం లేదట. తెలంగాణ ప్రాంతంలో బాడ్కావ్ అనేది సాధారణంగా వినిపించే ఒక చెడ్డ పదం. అయితే దాని అర్థం మాత్రం ఇప్పటి జనరేషన్లో చాలా మందికి తెలియదు. ఇక ఆంధ్రా ప్రాంతం నుండి వచ్చిన వారు ఈ పదం వినడమే చాలా అరుదు. ‘బాడ్కావ్’ పదానికి అర్థం చాలా మంది ‘వెదవ(ఫూల్)’ అనుకుంటున్నారు. కానీ అది నిజం కాదు. బాడ్కావ్ అనేది ఒక తిట్టు. ఒకరిని తిట్టే క్రమంలో తెలంగాణలో ఇలాంటి పదాలు వాడుతూ ఉంటారు. వాస్తవానికి దీన్ని తెలంగాణ పదం అనడం కూడా సరికాదు. ఇది ‘దక్కని’ లాంగ్వేజ్ నుండి వచ్చి పదం. నిజాం నవాబు కాలంలో తెలంగాణ, మరాఠీ, ఉర్దూ ఇలా మూడు మిలితమై ఉండే బాష మాట్లాడే వారు. దీన్నే ‘దక్కని’ లాంగ్వేజ్ అంటారు.

బాడ్కావ్ అనే పదానికి అర్థం...అమ్మాయిల బ్రోకర్ అని అర్థం. ఈ వర్డ్ క్యాచీగా ఉండటంతో శేఖర్ కమ్ముల ఈ పదాన్ని తన సినిమాలో వాడేశాడు. ఈ డైలాగ్ సాయి పల్లవి నోట రావడంతో మరింత పాపులర్ అయింది. ‘బాడ్కావ్’ అనేది ఎదుటి వ్యక్తి కించ పరిచే ఒక తిట్టు. ఇపుడు ఇంగ్లీషు, హిందీ, తెలుగు బాషలోని ఇంతకంటే దారుణమైన బూతు పదాలు ఈ తరం జనరేషన్ వాడుతున్నారు. వాటితో పోల్చుకుంటే ‘బాడ్కావ్’ అనేది అంత సీరియస్ వర్డ్ ఏమీ కాదు.

## ధనుష్ వెబ్ సిరీస్



నటుడిగానే కాదు దర్శక నిర్మాతగా ధనుష్ కి మంచి అనుభవముంది. అలాంటి ధనుష్ ఇప్పుడు వెబ్ సిరీస్ పై దృష్టి పెట్టాడని తెలుస్తోంది. రెండు సంవత్సరాల క్రితమే ఆయన వెబ్ సిరీస్ కి దర్శకత్వం చేయాలనుకున్నాడట. అయితే అప్పుడున్న కమిట్మెంట్స్ వలన అది సాధ్యపడలేదు. ఇప్పటికే హిందీ - తెలుగు వంటి సినీ పరిశ్రమల్లో ఓ మార్కెట్ ను తెచ్చుకున్న ధనుష్ ఇప్పుడు దాన్ని రెట్టింపు చేసేందుకు సిద్దపడుతున్నాడట. త్వరలో ఓ వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ధనుష్ చెప్పేశాడు. అది కూడా ఆయన దర్శకత్వంలోనే ఉంటుందట. రెండేళ్ల క్రితమే వెబ్ సిరీస్ స్టార్ట్ చెయ్యాలని ప్లాన్ చేసుకున్న ధనుష్ వీఐపీ 2 షూటింగ్ లో బిజీగా ఉండడం వలన కుదరలేదట. సినిమానుంచి ఈ మధ్య వెబ్ సిరీస్ వైపు చూపు మళ్ళిస్తున్నారు దర్శకులూ నిర్మాతలూ అంతా. వచ్చే జనరేషన్ వెబ్ సిరీస్ లదే అనీ, తాను ఇక మీదట వరుసగా వెబ్ సిరీస్ లు తీయబోతున్నాను అని చెప్పిన రామ్ గోపాల్ వర్మ “గన్స్ అండ్ థైస్ అంటూ” తన తొలి వెబ్ సిరీస్ ట్రైలర్ తోనే సంచలనం రేపాడు. ఇక ఇప్పుడు చాలామంది నటులూ దర్శకులూ వెబ్ సిరీస్ ల బాటపట్టారు. సో..! ధనుష్ కూడా తన ప్రయత్నాలు మొదలు పెట్టాడు. వెబ్‌సిరీస్ మరీ కొత్త ట్రెండేం కాదు. జోరందుకుంది మాత్రం ఇప్పుడే. పర్మనెంట్ రూమ్మేట్స్, లవ్ బైట్స్, గర్ల్ ఇన్ ద సిటీ, ఐషా... అంటూ ఉత్తరాదిని ఎప్పుడో వూపేశాయివి. సౌత్ లో ఈ హల్‌చల్ మొదలైంది మాత్రం ఏడాది కిందటే. అయినా మార్కెట్ బావుండటం, సినిమాలో ఉన్నట్టు సెన్సార్, రిలీజ్ సమస్యలు కూడా ఉండకపోవటం వంటి అడ్వాంటేజ్ లు చాలానే ఉన్నాయి. దీంతో వచ్చే ఏడాది తప్పకుండా వెబ్ సిరీస్ ను స్టార్ట్ చెయ్యాలని డిసైడ్ అయ్యాడట. ధనుష్ రెండు నెలల క్రితం దర్శకత్వం వహించి రిలీజ్ చేసిన పా పాండి సినిమా పాజిటివ్ టాక్ ను తెచ్చుకుంది. దీంతో వెబ్ సిరీస్ కథను రెడీ చేసుకొని మరి కొంత మంది రచయితల సహకారంతో మంచి కథనాన్ని డెవలప్ చేస్తున్నాడట.



## ఇక 192 దేశాల్లో బాహుబలి...

### ఇప్పటివరకున్న లెక్కలు ఇవే!

రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సీరీస్ సినిమాలు ఇండియన్ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులు క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. బాహుబలి సిరీస్‌లోని రెండు చిత్రాలు దేశంలో విడుదలైన అన్ని భాషల్లో బాక్సాఫీసు వద్ద సంచలన విజయం సాధించాయి. ఈ ఏడాది విడుదలైన బాహుబలి-2 మూవీ ఎవరూ ఊహించని ఘన విజయం సాధించింది. ఇండియన్ సినిమా పరిశ్రమ అప్పటి వరకు చూడని రూ. 1000 కోట్లు, రూ.1500 కోట్ల మార్కును నిర్మాతలకు చూపించిన తొలి సినిమా ఇదే. బాహుబలి 2 మూవీ ఇప్పటి వరకు రూ. 1700 కోట్ల వసూళ్లు సాధించింది. ఇండియన్ సినీ చరిత్రలో ఇది అతిపెద్ద మొత్తం. దేశం మొత్తం ఒక సినిమాను పిచ్చి పిచ్చిగా చూస్తే రిజల్ట్ ఎలా ఉంటుందో చెప్పడానికి ఇదో నిదర్శనం. ఇండియన్ బాక్సాఫీసు వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం ‘బాహుబల-2’ మాత్రమే. అమీర్ ఖాన్ ‘దంగల్’ మూవీ చైనాలో రిలీజ్ అయి అక్కడ భారీ విజయం సాధించడం వల్ల భారీ వసూళ్లు సాధించిందే తప్ప... డొమెస్టిక్ బాక్సాఫీసు వద్ద బాహుబలిని దాటలేక పోయింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ‘బాహుబలి’ సిరీస్ లోని రెండు సినిమాలు ఇక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 192 దేశాల్లో అందుబాటులోకి రానున్నాయి. ఆన్ లైన్ స్ట్రీమింగ్ రైట్స్ ఇటీవలే అమ్ముడైనట్లు సమాచారం. ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఈ సినిమా ఆన్ లైన్ ద్వారా అందుబాటులోకి రాబోతోంది. ఈ రైట్స్ 4 మిలియన్ యూఎస్ డాలర్లకు అమ్ముడైనట్లు సమాచారం. తమ సినిమా ద్వారా తెలుగు సినిమా ఖ్యాతి 192 దేశాలకు వ్యాప్తి చెందడం ఆనందంగా ఉందని, ఇలాంటి సినిమాలో తాము భాగమైనందుకు సంతోషంగా ఉందని నిర్మాతలు వెల్లడించారు.



## వరుస ఫ్లాపులు కానీ.. రేటు మాత్రం వంద కోట్లు

హృతిక్ రోషన్‌కి ఈమధ్య కాలంలో చెప్పుకోతగ్గ హిట్ రాలేదు. ‘క్రిష్’ సిరీస్ చిత్రాలతో సూపర్‌హీరోగా మారిన హృతిక్‌రోషన్ సినిమా వస్తుందంటే అభిమానులు చాలా అంచనాలు పెట్టుకుంటారు. స్టార్ హీరోగా కొనసాగుతున్న హృతిక్ కాబిల్ లో అంధుడిగా నటించడం ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేసింది. గతేడాది హృతిక్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నటించిన ‘మొహెంజొదారో’ చిత్రం ఆశించిన విజయం సాధించలేకపోయింది.ఈ సారైనా పెద్ద హిట్ ఇస్తాడు అనుకుంటే “బలం” లో అసలు బలమే లేకపోవటం తో చతికిల బడ్డాడు హృతిక్. నిజానికి గతకొంత కాలంగా సరైన హిట్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు హృతిక్. గతసంవత్సరం వచ్చిన మొహంజో దారో, కాబిల్ లాంటి భారీ ఆశలు పెట్టుకున్న సినిమాలు కూడా దారుణం గా దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఉన్న పోటీని తట్టు కోవటానికి హృతిక్ కి ఖచ్చితంగా ఒక హిట్ అవసరం. ఒకదాని వెనుక ఒకటి వరుసపెట్టి పరాజయాలు వేధిస్తోన్న ఈ తరుణంలో హిట్ ఎలా ఇవ్వాలా అని అతను తల పట్టుకున్నాడు. అయితే ఎన్ని ఫ్లాప్స్ వచ్చినా కానీ హృతిక్ రేంజ్ ఏమీ మారలేదని, అతని బ్రాండ్ వేల్యూ అలాగే వుందని నిరూపిస్తూ ఒక ఫిట్‌నెస్ కంపెనీ అతనితో వంద కోట్లకి డీల్ కుదుర్చుకుంది. ఈ మధ్యన ఈయన తండ్రి రాకేష్ రోషన్ మాత్రం క్రిష్-4 మీద వర్క్ నడుస్తోందని చెప్పాడు. మొత్తానికి అటు సినిమాలు లేక పోవటం తో ఉన్నసమయాన్ని ఇలా బట్టలిప్పేసి తన టామీ హిల్‌ఫిగర్ బ్రాండ్ బట్టల కోసం ఫోజులు ఇస్తున్నాడు. పనిలో పనిగా ఇంకో డీల్ కూడా కుదుర్చుకున్నాడు. హృతిక్ అయిదేళ్ల పాటు క్యూర్-ఫిట్ అనే సంస్థకి అంబాసిడర్‌గా ఉండటానికి గానూ భారీ ఆఫర్ అందుకున్నాడు. ఈ అయిదు సంవత్సరాలకు గానూ అతనికి వంద కోట్లు చెల్లిస్తారు. దీనికి సంబంధించిన ఒప్పందాలు జరిగిపోయాయి. హృతిక్‌కి చెందిన హెచ్‌ఆర్‌ఎక్స్ సంస్థతో కలిసి అసోసియేట్ అయి క్యూర్.ఫిట్. ఒక ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌ని ఇండియాలో లాంచ్ చేస్తోంది. హృతిక్ కంపెనీ ఇంట్రడ్యూస్ చేసిన వర్కవుట్ ప్లాన్‌ని క్యూర్-ఫిట్. విస్తృతం చేయనుంది.

## పాపం కాజల్: కోర్టు చివాట్లు పెట్టింది



కాజల్ కి కోర్టు గట్టిగానే వార్నింగ్ ఇచ్చింది. వీవీడీ కొబ్బరినూనె తయారీ సంస్థపై కాజల్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. అంతేకాకుండా ఇప్పటివరకు ఆ కంపెనీకి అయిన కోర్టు ఖర్చంతా కూడా కాజల్ అండ్ కో పెట్టుకోవాలని కోర్టు తీర్పునిచ్చింది. కేసు వివరాల్లోకి వెళితే.. 2008లో వీవీడీ కొబ్బరినూనె ప్రకటనలో నటించడానికి ఆ సంస్థతో కాజల్ ఎగ్రిమెంట్ చేసుకుంది. ఒక్క ఏడాదిపాటే ప్రసారంచేయాలనే నిబంధనతోనే ఆ ప్రకటనలో నటించానని, కానీ దాన్ని ఆ తర్వాతా ప్రసారంచేశారని ఆరోపిస్తూ ఆమె 2011లో మద్రాసు హైకోర్టులో కేసు వేసింది. ఒప్పందం ముగిసినప్పటికి తన ఫోటోను ఆ సంస్థ వాడుకుంటుందని అందుకు నష్టపరిహారంగా ఆ సంస్థ రెండున్నర కోట్లు చెల్లించాలంటూ ఆదేశం ఇవ్వాలని కాజల్ కోర్టుని కోరింది. దీనిపై తుది విచారణ జరిపిన జడ్జి జస్టిస్ టీ రవీంద్రన్ 60 సంవత్సరాల పాటు ఆ యాడ్ పై హక్కులు ఆ సంస్థకి ఉంటాయని తెలిపింది. ఈ క్రమంలో యాడ్ ని ఏడాది తర్వాత ప్రసారం చేయకూడదని కాజల్ డిమాండ్ చేయడం తప్పు అని అన్నారు. దీంతో కాజల్ కి కోర్టులో చుక్కెదురైంది. అసలు నిజానికి కాజల్ కోర్టుకు ఎక్కటానికి కారణం ఏంటంటే... కాజల్ ఆ యాడ్ చేశాక అమ్మడికి ఒక పెద్ద బ్రాండ్ కోకోనట్ ఆయిల్ యాడ్ వచ్చింది. ఈ కొత్త యాడ్ చేసుకోవాలంటే పాత యాడ్ తాలూకు వారి డీల్ ను క్యాన్సిల్ చేసుకోవాలి.

అందుకని తెలివిగా వ్యవహరించి అమ్మడు ఇలా కోర్టుకు ఎక్కింది. అయితే కాపీరైట్స్ చట్టప్రకారం ఒక ప్రకటన దాన్ని రూపొందించిన సంస్థకే చెందుతుందన్నారు.

అంతే కాకుండా 60ఏళ్ల వరకు వాణిజ్యప్రకటన ప్రమోషన్ హక్కులు వారికి ఉంటాయని చెబుతూ.. ఒక్క ఏడాదిలోనే ఆ ప్రకటనను ప్రసారం చేయాలని హక్కులేదని, ఒక వాణిజ్యప్రకటన ప్రమోషన్ హక్కులు ఆ సంస్థకు 60 ఏళ్ల వరకూ ఉంటాయని తీర్పు చెప్పారు.

# విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఆంధ్ర విశ్వవిద్యాలయంః విశ్వవిద్యాలయాలు పరిశోధన, పుస్తక రచనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర హెచ్ఆర్‌డి మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాత్రి ఏయూ అకడమిక్ సెనేట్‌మందిరంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో 'ఎమర్జింగ్ ఇష్యూస్ ఇన్ సెంటర్-స్టేట్ రిలేషన్స్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు.

అనంతరం మాట్లాడుతూ అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు ఆర్.సుదర్శన రావు, ఎస్.కె.వి సూర్యనారాయణ రాజు, పి.తారాకుమారిలు సంకలనం చేసిన పుస్తకం ప్రస్తుత పరిస్థితులకు ఎంతో ఉపయుక్తమన్నారు. యువ పరిశోధకులకు ఉపయుక్తంగా నిలచే విధంగా పుస్తకం ఉందన్నారు.భవిష్యత్తులో ఇటువంటి వర్తమాన అంశాలపై మరిన్ని పుస్తకాలను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

పుస్తక సంపాదకులు ఆచార్య ఆర్.సుదర్శన రావు పుస్తక పరిచయం చేశారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు పుస్తక సంపాదకులు ఆచార్య ఎస్.కె.వి సూర్యనారాయణ రాజు, ఆచార్య పి.తారా కుమారి, పాలక మండలి సభ్యులు ఎం.ప్రసాద రావు, సురేష్ చిట్టినేని, ప్రిన్సిపాల్ పి.ఎస్ అవధాని, ఆచార్య జగదీశ్వర రావు, అర్థ శాస్త్ర విభాగ ఆచార్యులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

### జడేజా, అశ్విన్ ఉంటే

# ఎదురుచూపులే..?



న్యూఢిల్లీ : జట్టులో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ లాంటి మేటి బౌలర్లు ఉంటే.. అవకాశం కోసం ఎదురుచూడక తప్పదని చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో ముగిసిన రెండు టెస్టుల్లోనూ రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన కుల్దీప్ యాదవ్.. మూడో టెస్టుకి నిషేధం కారణంగా జడేజా దూరమవడంతో తుది జట్టులో తనకి అవకాశం దక్కుతుందనే ధీమాలో ఉన్నాడు. అయితే.. జడేజా స్థానంలో మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌ని బీసీసీఐ సెలక్టర్లు తాజాగా ఎంపిక చేయడంతో ఇప్పుడు కుల్దీప్‌కి పోటీనెలకొంది. శనివారం నుంచి మూడో టెస్టు ప్రారంభంకానున్న నేపథ్యంలో మీడియాతో కుల్దీప్ మాట్లాడాడు జట్టులో నెం.1, నెం.2 టెస్టు బౌలర్లైన జడేజా, అశ్విన్ లాంటి వారు ఉంటే మరో స్పిన్నర్ అవకాశం కోసం ఎదురుచూడక తప్పదు. వీరి పోటీని ఎదుర్కొని తుది జట్టులో స్థానం సంపాదించడం అంత సులభం కాదు. అవకాశం కోసం ఎదురుచూడటమే క్రికెట్ ప్రాథమిక నియమం. అయితే.. గత ఆరు నెలలుగా వారితో కలిసి డ్రెస్సింగ్ రూమును పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది.

### లంకతో వన్డే సిరీస్‌కి

# కోహ్లీ దూరం?



దిల్లీ : భారత క్రికెట్ అభిమానులకు చేదువార్త. శ్రీలంకతో త్వరలో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ దూరం కానున్నట్లు సమాచారం. వరుస సిరీస్‌ల కారణంగా కోహ్లీతో పాటు జట్టులోని పలువురు ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే కోహ్లీ, రవీంద్ర జడేజా, ఉమేశ్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్, మహమ్మద్ షమిని వన్డే సిరీస్‌కి దూరం కానున్నారు. ఆతిథ్య లంకతో భారత్ ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ నెల 20న తొలి వన్డే ప్రారంభం కానుంది.

ఐపీఎల్, ఛాంపియన్స్ ట్రోఫీ, వెస్టిండీస్, శ్రీలంక.. వరుస పర్యటనల కారణంగా ఆటగాళ్లు విశ్రాంతి లేకుండా గడుపుతున్నారని.. ఈ క్రమంలోనే వారికి విరామం కల్పించాలని బోర్డు ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కోహ్లీ స్థానంలో సారథి బాధ్యతలను రోహిత్ శర్మకు అందించాలని బోర్డు భావిస్తోంది. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ జట్టుకి కెప్టెన్‌గా ఉన్న రోహిత్ మూడోసారి ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అభిమానులకు చేదువార్త అయినా యువ ఆటగాళ్లకు ఇది శుభవార్తే. సీనియర్ ఆటగాళ్ల స్థానంలో జట్టులోకి వచ్చేందుకు ప్రధానంగా అక్షర్ పటేల్, యుజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, బసిల్ థంపి పేర్లు వినిపిస్తున్నాయి.

మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఈ నెల 12న చివరి టెస్టు ప్రారంభంకానుంది.

# ఘనంగా పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం



హైదరాబాద్ : ఏపీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. హైదరాబాద్ లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్ లో ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. బంధుమిత్రులు హాజరై శ్రీరామ్-జ్ఞాన జంటను ఆశీర్వదించి, అభినందించారు.

హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. స్పీకర్ కోడెల, మంత్రులు దేవినేని, అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్ , ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, ఏపీ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరితో పాటు అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీనేతలు పయ్యావుల కేశవ్, కాలువ శ్రీనివాసులు, పరిటాల రవి అనుచరుడు చమన్ లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సొంత జిల్లా అమ్మాయినే పెళ్లి చేసుకుంటున్నాడు శ్రీరామ్. అనంతపురం జిల్లాకే చెందిన కాంట్రాక్టర్ వెంకటరమణ కూమార్తె జ్ఞాన. వీరి పెళ్లి అక్టోబర్ ఒకటో తేదీన జరగనుంది.




పెట్రోలియం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ సంస్థల కూటమి ప్రతినిధిగా హెచ్.పి.సి.ఎల్. వారిచే నిర్వహింప బడుతున్న స్కిల్ డెవలప్ మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు నూతన ఆవిష్కరణల విభాగంలో ప్రతిష్టాత్మక అసోచం అవార్డు లభించింది. బుధవారం సాయంత్రం న్యూ ఢిల్లీ లో జరిగిన ఓ కార్యక్రమం లో కేంద్ర ప్రావీణ్యాభివృఇద్ధి శాఖా మంత్రి రాజీవ్ ప్రతాప్ రూఢీ చేతులమీదుగా సంస్థ శెక్రటరీ కె.నగేష్, ఇంచార్గ్ సి.వి.నరసింహ దాసు అందుకున్నారు. ప్రారంభమైన కేవలం ఎనిమిది నెలలలోనే, వివిధ వినూత్న కార్యక్రమాలను రూపొందించి, నిరుద్యోగులైన యువత సబ్జక్ట్ పరంగానే కాకుండా, విభిన్న అంశాలలో సర్వతోముఖ ఎదుగుదలకు తోడ్పడు తున్నందుకు అవార్డ్ లభించినట్టు నగేష్ తెలియజేశారు.

### ఈ నెల 13నుంచి

# ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



విశాఖపట్నంః ఈ నెల 13 నుంచి 16 వరకు సాగర్‌నగర్‌లోగల ఇస్కాన్ మందిరంలోగల భగవాన్ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్ పేర్కొన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని తెలిపారు. 13వ తేదీన సాయంత్రం 4 గంటలకు సింహాచలం శ్రీ కృష్ణ నృత్య భారతి సంస్థ వారిచే శ్రీ కృష్ణ జన్మలీలలు ప్రదర్శింపబడునని తెలిపారు. అలాగే 14వ తేదీ శ్రీ కృష్ణ దామోదరం నృత్య రూపక్ ప్రదర్శన నిర్వహంచడుతుందని తెలిపారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అదే రోజు సాయంత్రం వివిధ పోటీలలు గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం మంగళహారతి, విశేష అలంకరణ, పూజలు, అఖండ హరినామ సంకీర్తన తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. జన్మాష్టమి వేడుకలలో భాగంగా స్వామి వారికి పుష్పాలంకరణ, ఉట్టి కొట్టుపండుగ, నైవేద్యములు, మంగళహారతి తదితర పూజా కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇస్కాన్ వ్యవస్థాపకుడు శ్రీ ప్రభుపాదుల వారి జయంతి సందర్భంగా స్వామి వారి నిత్య అర్చనలు ఘనంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన్మాష్టమి వివరాలను సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేశారు.

### ఖాళీ స్థలాలలో

# మొక్కల పెంపకం చేపట్టండి



విశాఖపట్నం: జివియంసి జోన్-2 పరిధిలోని పాండురంగాపురం లోని ఖాళీ స్థలాలలో మొక్కల పెంపకం చేపట్టాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా పాండురంగాపురం, ఆఫీసర్ క్లబ్ రోడ్, ఆఫీసర్స్ క్లబ్ రోడ్ ప్రక్కనున్న ఖాళీ స్థలం, డిస్టిక్ట్ స్పోర్ట్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోని ఖాళీ స్థలాలను కమిషనర్ పరిశీలించారు. స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాలను సక్రమంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.డ్రెయిన్స్ బాగులేని చోట మరమ్మత్తులు నిర్వహించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని కోరారు. జివియంసి ఖాళీ స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం, పార్కుల అభివృద్ధి చేయాలని సూచించారు. పాండురంగాపురం పరిధిలోని రహదారులపై వినియోగించని విద్యుత్, టెలిఫోన్ స్తంభాలను తొలగించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ స్థలాలయితే యజమానులను గుర్తించి, ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయాలని నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

# అనిల్ కుంబ్లే ఆత్మాభిమానం చంపుకోడు..!

న్యూఢిల్లీ : భారత మాజీ కోచ్ అనిల్ కుంబ్లే ఆత్మాభిమానం చంపుకోకుండా పదవి నుంచి వైదొలగి సరైన నిర్ణయం తీసుకున్నాడని మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ ప్రశంసించాడు. జూన్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన రెండు రోజులకే కోచ్ పదవికి అనిల్ కుంబ్లే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కెప్టెన్ కోహ్లీకి తన కోచింగ్ శైలి నచ్చకపోవడంతోనే తాను బాధ్యతల నుంచి పక్కకి తప్పుకుంటున్నట్లు కుంబ్లే ప్రకటించాడు. తాజాగా అజహరుద్దీన్.. కుంబ్లే వ్యక్తిత్వంపై మీడియాతో మాట్లాడాడు. కుంబ్లే అలా పక్కకి తప్పుకోవడం నాకు చాలా బాధ కలిగించింది.

ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన అతనికి ఈ విధంగా జరిగి ఉండకూడదు. నాకు తెలిసి ఎవరినీ ఇబ్బంది పెట్టే మనస్తత్వం కుంబ్లేది కాదు. బహుశా.. ఆత్మాభిమానం వదులుకోవడం కంటే కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడమే మంచిదని అతను భావించి ఉంటాడు. అతను సరైన నిర్ణయమే తీసుకున్నాడని నాకు అనిపిస్తోంది అని అజహరుద్దీన్ అభిప్రాయపడ్డాడు. కుంబ్లే రాజీనామా తర్వాత రవిశాస్త్రిని భారత జట్టు ప్రధాన కోచ్‌గా బీసీసీఐ నియమించిన విషయం తెలిసిందే.




# రాజధానిలో ప్లాస్టిక్ సంచులపై నిషేధం



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ సంచులపై మధ్యంతర నిషేధం విధిస్తూ జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాలు జారీ చేసింది. ఎన్‌జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ స్వతంత్ర కుమార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తే రూ.5000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దాంతో పాటు గురువారం నుంచి వారం రోజుల్లో 50 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను అన్నింటినీ స్వాధీనం చేసుకోవాల్సిందిగా దిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్లాస్టిక్, వ్యర్థాల నియంత్రణను తగ్గించేందుకు ఆమ్ ఆద్మీ ప్రభుత్వం, దిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందనే దానిపై సీనియర్ అధికారులతో కలిసి అఫిడవిట్‌ను రూపొందించి సమర్పించాల్సిందిగా ఎన్‌జీటీ ఆదేశించింది.

గతేడాది దిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలోని డిస్పోజబుల్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు గ్రీన్ ప్యానెల్ ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యర్థ పదార్థాలను వీలైనంత మేర తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్చలు చేపట్టింది. కూరగాయలు,

మాంసం దుకాణదారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే రూ.10వేలు జరిమానా చెల్లించాల్సి వస్తుందని గతంలోనే హెచ్చరించింది. గత నెల మధ్యప్రదేశ్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ సంచులపై నిషేధం విధిస్తున్నట్లు ప్రవేశపెట్టిన బిల్లుకు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపిన సంగతి విదితమే.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com